# కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య



## కామ్రేడ్

# పుచ్చలపల్లి సుందరయ్య

### మే 1, 1913 - మే 19,1985

ప్రతులకు :

**ప్రజాశక్తి బుక్‌హౌస్**

*ఎమ్‌హెచ్ భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్, ఆర్‌టిసి కళ్యాణమండపం*

*హైదరాబాద్ -20, ఫోన్ : 040 - 27660013*

ప్రచురణ సంఖ్య : 1260

ప్రథమ ముద్రణ : డిసెంబర్, 2012

వెల : `.10

ప్రచురణ : భారతీయ కమ్యూనిస్టు  పార్టీ (మార్క్సిస్టు)
కేంద్రకమిటీ,
ఎకె.జి.భవన్, న్యూఢిల్లీ

ప్రతులకు
ప్రజాశక్తి బుక్‌హౌస్
1-1-187/1/2, చిక్కడపల్లి, హైదరాబాద్-20. ఫోన్ : 27608107

బ్రాంచీలు
హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, ఖమ్మం,
హన్మకొండ, నల్గొండ, గుంటూరు, ఒంగోలు

ముద్రణ
ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, హైదరాబాద్

**పు**చ్చలపల్లి సుందరయ్య లేదా అందరూ ఆప్యాయంగా పిలుచుకునే పిఎస్ నెల్లూరు జిల్లా అలగానిపాడులో ఒక భూస్వామ్య కుటుంబంలో 1913 మే 1 వ తేదీన పుట్టారు. ఆయన తల్లిదండ్రులకు ఏడుగురు సంతానం. పెద్దవాడు వెంకటరామిరెడ్డి తర్వాత ఆయన పుట్టారు. వారి తండ్రి పుచ్చలపల్లి వెంకట్రామిరెడ్డి. ఆయనకు నలుగురు అక్కలు ఆ తర్వాత సుందరయ్య. ఆయన తర్వాత ఆఖరున పుట్టిన రామచంద్రారెడ్డి ప్రజా వైద్యుడిగా అందరికి తెలిసినవాడే. ఆయన తండ్రిగారికి 50 ఎకరాల వరకు భూమి వుండేది. ఆయనకు ఆ ప్రాంతమంతటా చాలా పలుకుబడి వుండేది. వ్యవసాయంలో ఆయన మంచి పనిమంతుడని అందరూ గౌరవించేవారు. ఆయన 1919లో అంటే సుందరయ్యకు ఆరేళ్ల వయస్సులో చనిపోయాడు. తర్వాత కాలంలో తల్లి శేషమ్మ పెద్దకుమారుడి సాయంతో కుటుంబాన్ని నడిపించే బాధ్యత తీసుకుంది.

సుందరయ్య ప్రాథమిక విద్యాభ్యాసం వూళ్ళో పంచాయితీ బడిలో సాగింది. దాన్ని వీధి బడి అనేవాళ్లు. ఆ బళ్ళోకి వ్యవసాయదార్ల పిల్లలు, చేనేత వాళ్ళ పిల్లలు వెళ్ళేవారు. అయితే దళితులకు ప్రవేశం నిషిద్ధం. సుందరయ్య చాలా తుంటరి పిల్లవాడని పేరు. అందుకే బడికి పంపించాలంటే మొదట్లో అమ్మానాన్నలకు పెద్ద సమస్య అయ్యేది. అయితే ఆ తర్వాత మాత్రం క్రమం తప్పకుండా స్కూలు కెళ్ళటం బాగా అలవాటయింది. బళ్ళో అక్షరాలు, ఎక్కాలు కొద్దికాలంలోనే వీటన్నింటిలో గొప్ప పట్టు సంపాదించాడు. పాఠాలలో అందరికన్నా ముందు వుండేవాడు. లెక్కలు బాగా చేసేవాడు. బాగా ప్రతిభావంతుడనిపించుకున్నాడు. వేమన, సుమతీ శతకాల్లోని పద్యాలు కంఠతా వచ్చేవి. ప్రాథమిక తరగతులు ఇతరుల కన్నా త్వరగా పూర్తి చేసుకున్నాడు

## తొలి చైతన్యం

పిల్లవాడుగా వుండగానే సుందరయ్య సామాజిక అసమానతలను, పీడనకు వ్యతిరేకంగా స్పందించడం మొదలుపెట్టాడు. గ్రామంలో కుల వివక్ష ఆయనకు చాలా కష్టం కలిగించేది. దానిపై ఇంట్లో బయిటా కూడా కుల వివక్షకు వ్యతిరేకంగా పెద్దలతో వాదన వేసుకునేవాడు. 1920లో 16 ఏళ్ళు మాత్రమే వున్న తన అక్కయ్యను 42 ఏళ్ల వాడైన వీరాస్వామిరెడ్డి అనే మేజిస్ట్రేట్‌కు ఇచ్చి వివాహం చేయాలని తలపెట్టినప్పుడు ఆయన వ్యతిరేకించాడు. అయితే ఆ కుర్రాడి మాటలు అప్పుడెవరూ పట్టించుకోలేదు. ఆ పెళ్లి జరిగిపోయింది.

ఆ తర్వాత సుందరయ్య, తమ్ముడు రామ్‌లను చదివించే నిమిత్తం అక్కయ్య తనతో తిరువళ్ళూరు తీసుకువెళ్ళింది. తిరువళ్ళూరులో మూడు, నాల్గు, అయిదు తరగతుల వరకు చదువుకున్నాడు. ప్రాథమిక విద్య అంతా తమిళంలో సాగేది. తమిళం ఒక్క అక్షరం ముక్కరాకపోవడంతో ఏమీ అర్థమయ్యేది కాదు. భాషతో సంబంధం లేని లెక్కల్లో మాత్రం బాగా రాణించేవాడు. సమస్య అర్థమైన ఆయన బావ తమిళ పంతులునొకర్ని నియమించారు. ఈ అనుభవం వల్ల సుందరయ్య విద్యార్థులకు మాతృభాషలోనే బోధించాలని గట్టిగా వాదించడం మొదలెట్టాడు. చరిత్ర పుస్తకాలపై ఆయనకు ప్రత్యేకించి ఆసక్తి. విడవకుండా చదివేవాడు. తర్వాత తన బావ బదిలీల కారణంగా ఏలూరు, రాజమండ్రి పట్టణాలలో చదువు కొనసాగించాడు.

రాజమండ్రి స్కూలులో చదువుతున్నప్పుడు సుందరయ్య స్థానిక గ్రంథాలయానికి క్రమం తప్పకుండా వెళ్ళేవాడు. తలుపులు తాళం వేసేంత వరకూ కూచుని చదువుతుండేవాడు. అక్కడే ఆయన కందుకూరి వీరేశలింగం, చిలకమర్తి లక్ష్మీ నరసింహం, పానుగంటి లక్ష్మీ నరసింహం వంటి సంస్కర్తల గురించి తెలుసుకున్నాడు. అయితే రాజకీయ సామాజిక సమస్యలపై ఆయన వైఖరిలో మూల మలుపు, తర్వాత కాలంలో గాని రాలేదు. అదెలా జరిగిందో ఆయన మాటల్లోనే:

ఒక రోజున మేము గోదావరి గట్టున కూర్చుని వున్నాం. అప్పుడు చిత్తరంజన్‌దాస్ చనిపోయినట్టు (జూన్ 1925) వారికి వర్తమానం వచ్చింది. ఆయన మరణానికి వాళ్ళు బాగా బాధపడుతుంటే చిత్తరంజన్‌దాస్ ఎవరని పార్వతీశంను అడిగాను. అతనికి బాగా కోపం వచ్చింది. "అన్ని పుస్తకాలు చదువుతుంటావు. నీకు

ఎక్కడా చిత్తరంజన్‌దాస్ పేరు తగల్లేదా అని కోపంగా అడిగాడు .తర్వాత తనే చిత్తరంజన్ దాస్ గురించి వివరంగా చెప్పాడు. ఆయన జీవితం పోరాటాలకు సంబంధించిన కొన్ని పుస్తకాలిచ్చాడు. అప్పటి వరకూ భారత జాతీయ కాంగ్రెస్‌ను, దాని నాయకులను గురించి నేను పెద్దగా పట్టించుకోలేదు. ఒక పెద్ద దేశనాయకుడు చనిపోతే ఆయన గురించి ఏమీ తెలియకపోవడం పట్ల నాకు చాలా సిగ్గేసింది. నేను 1922 ఉద్యమం చూశాను గాని దాన్ని అనుసరించడం లేదా పాల్గొనడం చేయలేదు. అప్పటి నుండి తప్పనిసరిగా దినపత్రికలు చదవడం, కాంగ్రెస్ గురించి జాతీయ ఉద్యమం గురించి తెలుసుకోవడం అలవాటుగా మార్చుకున్నాను. ఆంధ్రపత్రిక కు నిరంతర పాఠకుడుగా తయారయ్యాను. జలియన్ వాలాబాగ్ నరమేధంపై కాంగ్రెస్ ఒక నివేదిక విడుదల చేసింది. అది చదివాక బ్రిటిష్ సామ్రాజ్యవాదంపై ద్వేషం పెరిగింది. జాతీయోద్యమంలో చేరాలని నిర్ణయించుకున్నాను. దీంతో పాటు ఆంధ్రపత్రిక రోజూ చదవడం వల్ల గాంధీ జీవితం కూడా పరిచయమైంది. రోజూ క్రమం తప్పకుండా చదివే అలవాటు వల్ల జాతీయ స్థాయి రాజకీయ పరిణామాలపై గట్టి పరిశీలన జరిపే అవకాశమేర్పడింది. కొన్ని అంశాలు నన్ను ఎంతగానో ఆకర్షించాయి. – గాంధీజీ విడుదల, స్వరాజ్ పార్టీతో పోరాటం వీటన్నిటి ప్రగాఢ ప్రభావం నాపై పడింది.

ఇవన్నీ ఇలా జరుగుతుండగానే పార్వతీశం, సుబ్బారావు అనే ఆ యిద్దరు మిత్రులు గాంధీగారి మార్గంలో దేశాన్ని కాపాడుకోలేమనీ, సాయుధ పోరాటమే సరైన మార్గమని అన్నారు. అందుకై మనం ఒక "గ్రూపు" గా ఏర్పడి ఉద్యమాన్ని నడిపించాలని ప్రతిపాదించారు. వారికి అవసరమైన జాగ్రత్త కూడా వుండేది. అయితే ముందు ఆ పోరాటం ఏమిటో స్పష్టత వచ్చేందుకు ఒక ఏడాది విస్తారంగా అధ్యయనం చెయ్యాలని వారు సూచించారు.తర్వాతనే మనం వ్యూహాన్ని రూపొందించుకోవాలి. అప్పటికే మా దగ్గర టెర్రరిస్టులపైన వారి పోరాటాల పైన అనేక పుస్తకాలు అందుబాటులో వుండేవి. ప్రత్యేకించి కాకోరి కుట్రకేసు తదితర ఘటనలపై పుస్తకాలుండేవి.

1925 డిసెంబరులో మెట్రిక్యులేషన్ పూర్తి చేసే నాటికి రాజమండ్రిలో మేము చిన్న టెర్రరిస్టు బృందం ఏర్పాటు చేసుకున్నాము. నాతో పాటు పందిరి మల్లికార్జున రావు, ఇ.ఆర్.రెడ్డి మరొకరో ఇద్దరో వుండేవారు'

## మద్రాసులో క్రియాశీలత

సుందరయ్య బావ ఆయనకు బాగా సహకరిస్తుండేవాడు. తన పిల్లలకు కూడా ఆయనను నమూనాగా చూపించేవాడు. సుందరయ్యలా చదువుకోవాలని లోకజ్ఞానం

పెంచుకోవాలని చెప్పేవాడు. బాగా చదువుకొమ్మని ప్రోత్సహించడం తప్ప ఎలాటి షరతులు ఆంక్షలు విధించేవాడు కాదు. గ్రంథాలయాలకు వెళ్ళడం, వినోద యాత్రలు చేయడం రాజకీయ కార్యకలాపాలు వంటి వాటికి కూడా అవి ఇంట్లో ఎలాటి ఇబ్బంది కలిగించనంతవరకూ అభ్యంతర పెట్టేవాడు కాదు. అయితే తమ్ముడు రామ్ మాత్రం అల్లరి పనులు చేస్తూ ఏదో ఒక తంటా తెచ్చేవాడు. దాంతో తనను అప్పుడప్పుడూ శిక్షించాల్సి వచ్చేది. ఇది చివరకు బావ బావ మరుదుల మధ్య వివాదానికి దారి తీసింది.

1926 లో రాజమండ్రిలో రెండేళ్ళు వున్న తర్వాత సుందరయ్య, రామ్‌లు మద్రాసు వెళ్ళారు. అప్పటికే అక్కడ వున్న వీరారెడ్డి అనే బంధువు వాళ్ళు స్థిరపడ్డానికి సహాయం చేశాడు.

సుందరయ్య ట్రిప్లికేన్‌లో హిందూ హైస్కూలులో చేరి 6,7,8 తరగతులు చదువుకున్నాడు. మద్రాసుకు వెళ్ళేప్పటికి ఆయనకు 13 సంవత్సరాలు మాత్రమే. అయినా వ్యక్తిగత జీవితంలోనూ రాజకీయంగానూ తగినంత అనుభవం గడించి వున్నాడు. పట్టువదలని చదువరిగా తెలుగులో ప్రసిద్ధమైన నవలలన్నీ చదివేశాడు. హిందూ హైస్కూలులో వుండగానే బుర్ర మరింత వికసించింది.. ఇంగ్లీషులో గాంధీజీ పుస్తకాలు చదవడంతో పాటు ఆయన నడిపే "యంగ్ ఇండియా" పత్రికను క్రమబద్ధంగా చదవడం అలవాటు చేసుకున్నాడు. మునిసిపల్ లైబ్రరీ (ఫైవ్ క్రాస్ రోడ్) కు వెళ్ళి హిందూ ఇతర ఇంగ్లీషు పత్రికలూ చదివేవాడు.కొన్ని తత్వశాస్త్ర, మతపరమైన గ్రంథాలు కూడా చదవసాగాడు. వివేకానంద ఉపన్యాసాలు 7 సంపుటాలూ, స్వామి రామతీర్థ రచనలూ దయానంద సరస్వతి రాసిన "సత్యార్థ ప్రకాశం" చదివేశాడు. ఇవన్నీ చదివాక పాశ్చాత్య తత్వశాస్త్రంపై ఆసక్తి పెరిగి కాంట్ రచనలు చదవడం మొదలుపెట్టాడు.

సుందరయ్య పదవ తరగతిలో వుండగా స్కూల్లో భగవద్గీత గురించి వ్యాస రచన పోటీలో పాల్గొని ఒక వ్యాసం రాసిచ్చాడు. ఆ పోటీల న్యాయనిర్ణేతలలో ఒకరుగా వున్న తెలుగు లెక్చరర్ వాళ్ల క్లాసుకు వచ్చి ఆయన రాసిన వ్యాసం బిగ్గరగా చదవనారంభించారు. "క్రైస్తవులకు బైబిల్ ఎంతో మనకు భగవద్గీత అంత ముఖ్యమైనది" అన్న వాక్యంతో ఆ వ్యాసం మొదలైంది. భగవద్గీతను బైబిల్‌తో పోల్చడం ఆయనకు కోపం తెప్పించింది. గీత అంతకన్నా చాలా గొప్పదని ఆయన అభిప్రాయం. అయితే వ్యాసం సాంతం చదివాక ఆయన దాని ప్రాధాన్యత గుర్తించాడు. "నీవు గీతా రహస్యం మొత్తం ఎలా చదవగలిగావు అది చాలా పెద్దది." 'సరిగ్గా ఆ పుస్తకంలో ఏముందో అదే వ్యాసంలో కూడా పొందుపర్చగలిగావు' అని అడిగారు. మానవాళికి గీత ఇచ్చే ఆధ్యాత్మిక

సందేశం ఏమిటో సుందరయ్య తన వ్యాసంలో ప్రముఖంగా పేర్కొన్నాడు . అదే నిష్కామ కర్మ. అంటే నీ కర్తవ్యాన్ని నువ్వు నిర్వహించు. ఫలితాన్ని గూర్చి పట్టించుకోవద్దు' అన్నదే. స్వామి వివేకానంద, రామకృష్ణ పరమహంసల విషయంలోనూ సుందరయ్యను ఎక్కువగా ఆకట్టుకున్నది పునరుద్ధరణ వాదం కాదు – మానవాళికి సేవ చెయ్యటమే. మైలాపూర్‌లోని రామకృష్ణాశ్రమం తరచూ సందర్శించేవాడు. ఇదంతా 1927–28లో సంగతి.

చిన్నవయస్సులోనే సుందరయ్య సాంఘిక సమస్యలపై స్పందించేవాడు. గ్రామంలో వుండగా దళితులను ఇంట్లోకి ఎందుకు రానివ్వవని అమ్మతో తగాదా వేసుకొనేవాడు. వ్యవసాయ కార్మికులకు న్యాయంగా రావలసింది ఇవ్వకుండా మోసం చేస్తున్నారని నిలదీసేవాడు. ఆనాటి తన అనుభవాలను సుందరయ్య ఇలా వివరించారు:

"నేను హరిజనులతో కలిసిపోవడం ప్రారంభించాను. వాళ్ళతో పాటు పొలంలో పనిచేసేవాణ్ణి. వారితో చాలా స్నేహంగా వుండేవాణ్ని. ఈ మాత్రం సానుభూతి చూపినందుకే వారు ఎంతో ఉత్సాహపడేవారు. వ్యవసాయ కార్మికులకు, ఇంట్లో పాలేర్లకు నా పట్ల చాలా అభిమానం వుండేది. తమను ఎలా పిలవాలనే దానిపై మా అమ్మతో అనేక సార్లు ఘర్షణపడటం వారు చూస్తుండేవారు. మా అమ్మ వాళ్ళను వారిపేర్ల చివర "గాడు", అని పిలవడం అవమానకరమైందిగా వుండేది. వాళ్లను వాళ్ల అసలైన పేర్లతో పిలవాలని చెప్పేవాణ్ని. క్రమేణా నాకు హరిజనులతో మంచి సంబంధాలు ఏర్పడ్డాయి. వారు తమ భావాలు, అలాగే తరాల పర్యంతం కొనసాగుతున్న సమస్యలు నాకు చెప్పుకునే వారు. వాళ్ళని భూస్వాములు ఎలా బాధలు పెడుతున్నదీ, చేలగట్లపై తమ పశువులను కూడా మేయకుండా వారెలా అడ్డుపడుతున్నదీ, అలాగే సరైన కూలి ఇవ్వకుండా చేస్తున్నదీ చెప్పేవాళ్ళు."

యానాది అనే ఒక తెగ గ్రామంలో వుండేవాళ్ళు. వాళ్ళను నేరాలు చేసే "తెగ"గా పరిగణించేవారు. వాళ్ళు ప్రధానంగా జిప్సీలు పశువులు తప్పిపోయినా లేక దోపిడీ జరిగినా ఇంకేదైనా కనిపించకపోయినా వాళ్ళనే అనేవాళ్ళు. వెంటనే పోలీసులు, ధనిక రైతులు వాళ్ళు ఎక్కడికి వెళ్తే అక్కడకు వెళ్ళి వెంటాడి వేధించేవారు. నానా ప్రశ్నలు వేసి చిత్ర హింస పెట్టేవాళ్లు.ఒకరోజు వాళ్ల ఇంట్లో పనిచేసే యానాది ఒకరిని అన్నయ్య విచక్షణా రహితంగా కొడుతుంటే సుందరయ్య అడ్డుతగిలాడు. కుటుంబ సభ్యులకు పోలీసులకు వ్యతిరేకంగా నిలబడ్డాడు.

మద్రాసులో వుండగా విద్యార్థి యువజనులలో సామాన్యంగా మానవతా భావాలతో సేవ చేసే చైతన్యవంతులైన విద్యార్థి బృందంలో సుందరయ్య కూడా పాలు

పంచుకునేవాడు. సామాజిక అంశాలలో ఆయన పాత్ర పరిమితమైందైనా నా చదువు పూర్తి కాగానే మీ సమస్యపై మరింత గట్టిగా తీసుకుని పని చేస్తానని బాధితులకు భరోసా ఇచ్చేవాడు.

హిందూ స్కూలులో కేవలం చదువులోనే గాక ఇతర పుస్తకాలు కూడా విస్తారంగా చదివే ప్రతిభావంతుడిగా పేరు పొందాడు. అప్పుడే ఆయన యోగపై ఆసక్తి పెంచుకుని క్రమబద్ధంగా "యోగాభ్యాసం" మొదలు పెట్టాడు. 1927లో మద్రాసులో భారత జాతీయ కాంగ్రెస్ వార్షిక మహాసభలు జరిగాయి. పిఎస్ ఆ సభల్లో పాల్గొనకపోయినా ఆ సందర్భంగా నిర్వహించిన మేళాకు వెళ్లి కొన్ని పుస్తకాలు, పత్రాలు కొనుక్కున్నాడు.

## సైమన్ గోబ్యాక్

1928 ఫిబ్రవరిలో సైమన్ కమిషన్ బహిష్కరణకై ఇచ్చిన దేశవ్యాపితంగా పిలుపు సందర్భంగా సుందరయ్య తొలి క్రియాశీల రాజకీయ భాగస్వామ్యం మొదలైంది. సైమన్ కమిషన్ "బహిష్కరణ" రోజు స్కూలుకు వెళ్ళవద్దు అని తోటి విద్యార్థులందరినీ కోరాడు. ఆ పిలుపు బ్రహ్మాండంగా జయప్రదమైంది. ఆ మర్నాడు హెడ్ మాస్టరు క్లాసు వుంది. ఆయన చండశాసనుడు. అందరికీ హడల్. సుందరయ్య అయిదు నిముషాలు ఆలస్యంగా వెళ్లాడు. "నిన్న ఎందుకు స్కూలుకు రాలేదు?" అని ప్రశ్నించారు. నిన్న దేశ వ్యాపితంగా సైమన్ కమిషన్ కు నిరసనగా బహిష్కరణ పిలుపు వున్నందున స్కూలుకు రాలేదు అన్నాడు. తడుము కోకుండా జవాబు చెప్పడంతో ఆయన ఆశ్చర్యపోయాడు. తర్వాత మాటల యుద్ధమే జరిగింది. చివరకు హెడ్మాస్టరు చేసేదేమీ లేక, సంబంధిత అధికారులు పెద్దల అనుమతి లేకుండా తరగతులను బహిష్కరించడం సరికాదని చెప్పి చర్చను ముగించాడు. బెంచీలపై నిలబెట్టిన పిల్లల్ని కూడా కూర్చోమని చెప్పాడు. ఆ తర్వాత సుందరయ్య తరగతి నుంచి వెళ్లిపోతున్న సమయంలో నేను అడిగిన పద్యం అప్పజెప్పగలవా అని అడిగాడు. వెంటనే చక్కగా అప్పజెప్పాడు. నిజానికి ఆయన అయిదు నిమిషాలు ఆలస్యంగా రావడానికి కారణం ఆ పద్యమే. నెమ్మదిగా నడుస్తూ ఆయన ఆ పద్యం నేర్చుకున్నాడు. అందువల్లనే హెడ్మాస్టరు ఆయనను తప్పు పట్టేందుకేమీ దొరకలేదు. క్లాసు అయిపోయిన తర్వాత పిల్లలందరూ చుట్టూ చేరి తాము నిస్సహాయులమని, పిరియడు మొత్తం నిలబడే వున్నామని చెప్పారు. మీరు కూడా ఇదే

కారణం చెప్పి వుండొచ్చు కదా అని అడిగారు.

సుందరయ్య స్కూలు అధికారులను ఎదిరించిన సందర్భం మరొకటి వుంది. మహాత్మాగాంధీ 1928లో మద్రాసు సందర్శించారు. ప్రెసిడెన్సీ కాలేజి ఆటస్థలంలో బహిరంగ సభ జరిగింది. అదే రోజు సాయంత్రం ట్రిప్లికేన్ బీచ్ దగ్గర స్కౌట్ ర్యాలీ వుంది. పిఎస్ మంచి స్కౌట్‌గా పేరు తెచ్చుకున్నాడు. మొదట ఆ ర్యాలీకి హాజరై తర్వాత అదే స్కౌట్ దుస్తులలోనే సరాసరి గాంధీగారి సభకు వెళ్ళాడు. ఆ మర్నాడు స్కౌట్ మాస్టరు "స్కౌట్ యూనిఫారంలో గాంధీగారి సభకు ఎందుకు వెళ్ళావు? అది తప్పు. అని మందలించాడు. అందులో తప్పేమిటని సుందరయ్య అన్నారు. "స్కౌట్ యూనిఫారంలో రాజకీయ సభకు వెళ్లడం తప్పు అని మామూలు బట్టలు మార్చుకుని వెళ్లాల్సిందని ఆయన చెప్పాడు. ఆ స్కౌట్ మాష్టరు భారతీయుడే. హిందూ హైస్కూలులో పని చేస్తుండేవాడు. మళ్ళీ అడిగారు. అలాంటి ఆంక్షలు వుంటే ఇక నుండి స్కౌట్‌లో వుండను. మీ యూనిఫారం మీరు తీసుకోండి" అంటూ సుందరయ్య బట్టలు వెనక్కు ఇచ్చేశాడు.

## కాలేజీ చదువు: జాతీయ రాజకీయాలలో ప్రవేశం

లయోలా కాలేజీలో ఇంటర్మీడియట్‌లో "గణితము", భౌతికశాస్త్రము, రసాయన శాస్త్రము ఆప్షనల్‌గా తీసుకున్నాడు. అవి ఆయన సబ్జక్టులైనప్పటికీ అవే గాక ఆయన విడిగా చరిత్ర, అర్థశాస్త్రాలకు సంబంధించి కూడా చాలా చదివేవాడు. అప్పటికి ఇంగ్లీషులో జీగ్‌శాండర్స్ రాసిన 'రాజకీయ అర్థశాస్త్రం', అలాగే టాసిక్ రాసిన రాజకీయ అర్థశాస్త్రం, లాస్కీ రచించిన రాజకీయ వ్యాకరణము తదితర పుస్తకాలు చదువుతున్నాడు. రవీంద్రనాథ్ టాగూర్, నెహ్రూ తదితరుల రచనలు కూడా పఠించాడు.

ఈ దశలో సుందరయ్యపైన గాంధీ ప్రభావం విపరీతంగా వుండేది. ఆయనను అనేకసార్లు చూడటానికి వినటానికి అవకాశం కలిగింది. గాంధీజీ నిరాడంబరత, సామాజికాంశాలపై ఆయన కృషి ప్రత్యేకించి అస్పృశ్యతా నివారణ ఎంతగానో ఆకట్టుకున్నాయి. అయితే ఆయన ప్రసంగాలు మాత్రం రాజకీయంగా గాని, ఇతర విధాలుగా గాని సమగ్రంగా వుండేవి కావు. కేవలం రెండు నుంచి అయిదు నిముషాలు మాత్రమే ఆయన మాట్లాడేవాడు. తనతో సహా ప్రజలు కేవలం ఆయన దర్శనం కోసం వెళ్తున్నట్లనిపించింది. బహుశా ఈ అనుభవం వల్లనే సుందరయ్య తదుపరి సంవత్సరాలలో

రాజకీయ ప్రసంగాలు ఎప్పుడు చేయవలసి వచ్చినా వివరంగా సోదాహరణంగా మాట్లాడ్డం అలవాటు చేసుకున్నారనిపిస్తుంది.

లయోలా కాలేజీలో చదువు కోసం కాకినాడ నుంచి మద్రాసు వచ్చిన ఒక బృందంతో సుందరయ్య కలిశారు. కంభంపాటి సత్యనారాయణ (సీనియర్) వారిలో ఒకరు సుందరయ్య వాళ్ళకి యోగ గురువు. తెల్లవారు ఝామునే లేపి వాళ్ళను క్లాసులకు సిద్ధం చేసేవాడు. సాయంత్రం పూట మామూలు విషయాలు, రాజకీయాలు, కళా సాహిత్యాలు సంస్కృతి సైన్సు తదితర విషయాలపై చర్చించుకునే వాళ్లు.

## కమ్యూనిజంతో ముఖాముఖి

ఈ కాలంలోనే బొంబాయి యువజన సంఘం ప్రతినిధిగా హెచ్.డి.రాజా లయోలా కాలేజీకి వచ్చాడు. ఆయనే సుందరయ్యకు ఆయన బృందానికి మొదటిసారి “కమ్యూనిస్టు ప్రణాళిక” పరిచయం చేశాడు. తనతో పాటు కొన్ని పత్రికలు, సోషలిస్టు సాహిత్యం కూడా తీసుకొచ్చాడు.. ఆయన వాళ్లకు “కమ్యూనిజం” అంటే ఏమిటో, ఆ ఉద్యమంపై ప్రపంచ వ్యాపితంగా ఏ విధమైన సాహిత్యం అందుబాటులో వుందో వివరించాడు.

సుందరయ్యను కమ్యూనిస్టు ప్రణాళిక ఎంతగానో ప్రభావితం చేసింది. దాన్ని చదివాక కమ్యూనిజమే సరైన రాజకీయ దృక్పథం అని నిర్ణయించుకున్నాడు.. ఆ ప్రభావంతోనే ఆయన స్నేహితులతో సహా యూత్‌లీగ్‌ను ఏదో ఒక విధమైన కమ్యూనిస్టు అనుకూల వర్గంగా మార్చాలని నిర్ణయం తీసుకున్నాడు. ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోవడానికై మరింత మంది విద్యార్థులను చేర్చుకోవాలని భావించారు. ఒక వామపక్ష అనుకూల గ్రూపుగా వ్యవహరించాలని, మరింత అధ్యయనంతో ఉద్యమాన్ని పెంపొందించాలని నిర్ణయించుకున్నాము.

ఇది ఇలా వుంటే 1929లో మీరట్ కుట్రకేసు ప్రారంభమయింది. మద్రాసు పత్రికలలో ఆ కేసు వివరాలు చాలా చాలా తక్కువగా వచ్చేవి. ఆ కేసుపై ఎలాటి సాహిత్యం అందుబాటులో వున్నా వారు తెప్పించుకునేవారు. ఆ విధంగా ఆ రోజుల్లో సాహిత్యం తెప్పించుకోవడం చాలా కష్టమైనప్పటికీ హెచ్‌డి.రాజా బాంబే నుండి కొంత వరకూ పంపించేవాడు. మీరట్ కేసు గురించి తగినంత సమాచారం తెలుసుకోవడానికి. రహస్యంగా, దొంగచాటుగా తెప్పించుకోవడం లేదా నేరుగా బొంబాయి వెళ్లి తెలిసిన

వాళ్లతో సంబంధం పెట్టుకుని సంపాదించుకురావడం జరిగేది. మీరట్ కుట్రకేసుతో పాటు భగత్‌సింగ్ బాంబు కేసు, ప్రజా భద్రతా చట్టం, తదితర విచారణల గురించి కూడా తెలుసుకున్నారు.

## సంపూర్ణ స్వతంత్రం కోసం

కమ్యూనిస్టులు ముందుగా లేవనెత్తిన డిమాండును అనుసరిస్తూ భారత జాతీయ కాంగ్రెస్ సంపూర్ణ స్వాతంత్ర్య తీర్మానం చేసింది. స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకుంటూ 1930 జనవరి 26ను ప్రథమ భారత స్వాతంత్ర్య దినం నిర్వహించింది. ఆ సందర్భంగా సుందరయ్య తదితరుల నాయకత్వంలో విద్యార్థులందరూ లయోలా కాలేజి నుండి బ్యానర్లు, త్రివర్ణ పతాకాలు పట్టుకుని మైలాపూర్, ట్రిప్లికేన్‌ల మీదుగా తిరిగి కాలేజీ వరకూ పెద్ద వూరేగింపు తీశారు. అప్పట్లో ప్రజల్లో ఉద్వేగం వున్నా మద్రాసులో కాంగ్రెస్ పెద్ద సంఘటిత శక్తిగా గాని, బలంగా గాని వుండేది కాదు. కనుకనే ఈ విద్యార్థి ప్రదర్శన నగరాన్ని విద్యుత్తేజంలా తాకింది. సత్యమూర్తి, సోమేశ్వరరావు తదితర స్థానిక కాంగ్రెస్ నాయకులు వారిని ఆ రోజు అభినందించారు. "ఈ రోజు మీ వల్ల మా పని తేలికైంది" అని వారన్నారు. స్థానిక పత్రికలు కూడా వీరి ప్రదర్శన గూర్చి ప్రముఖంగా రాశాయి.

మర్నాడు కాలేజీకి వెళ్లగానే ఇంగ్లీషు ప్రొఫెసర్ ఫాదర్ మర్ఫీ గాంధీ టోపి పెట్టుకొని కాలేజీకి వచ్చిన ఒక విద్యార్థిని దాన్ని తీసేయమన్నాడు. అతడు తియ్యడానికి నిరాకరించడంతో క్లాసులోంచి బయటికి పంపించాడు. మర్ఫీ కాలేజీ ప్రిన్సిపాల్ ఫాదర్ బెట్రాండ్ కూడా ఇంగ్లీషు వాడే. గాంధీ టోపీతో ఏ విద్యార్థి కాలేజీకి రాకూడదని నోటీసు బోర్డులో సర్క్యులర్ పెట్టారు. అందువల్ల సహజంగానే విద్యార్థులు ఈ ఘటనను తేలిగ్గా తీసుకోవడానికి సిద్ధపడలేదు. జాతీయ భావనలు పొంగి పొర్లుతున్న విద్యార్థులు ఆగ్రహంతో వూగిపోయారు. మనం టోపీలు పెట్టుకోకుండా ఆపడానికి వారెవరు? అన్న కోపం అందరిలో నెలకొంది. "ఏమైనా మనం టోపీలు పెట్టుకుని వాళ్లను ధిక్కరిద్దాం" అని అప్పటికప్పుడే నిర్ణయించుకున్నారు. మరుసటి రోజు ఉదయానికల్లా 500 గాంధీ టోపీలు కుట్టారు. తరగతులు బహిష్కరించారు. ఆ తర్వాత అందరూ గాంధీ టోపీలు పెట్టుకుని కాలేజికి వెళ్ళారు. మొత్తం కాలేజీ తరగతి గదులు, క్రీడా మైదానం, ఆవరణ తెల్లటోపీలు పెట్టుకున్న విద్యార్థులతో నిండిపోయాయి. చివరకు ప్రిన్సిపాల్ దిగిరాక తప్పలేదు. గాంధీ టోపిలు పెట్టుకుని క్లాసుకు రావడానికి అధికారులు అభ్యంతరం చెప్పరంటూ కొత్త ఉత్తర్వు నోటీసు బోర్డులో పెట్టాడు. కాలేజీలో భారతీయ ఉపాధ్యాయులు,

అధ్యాపకులందరూ వారు సాధించిన విజయాన్ని, పోరాట స్ఫూర్తిని అభినందించారు.

1930 జనవరి 26 విద్యార్థుల ప్రదర్శన, ఆ వెంటనే ఈ గాంధీటోపీలపై ఆందోళన ఘటనలతో లయోలా కాలేజీ విద్యార్థుల నాయకత్వ లక్షణాలు నిర్వహణా శక్తి వెలుగులోకి వచ్చాయి. ప్రత్యేకించి సుందరయ్య నిర్మాణ దక్షత వెల్లడైంది. దేశం మొత్తం మీద ఆ విధంగా సంఘటిత విద్యార్థి నిరసన అదే మొదటి సారి. దానికి మీడియా కూడా అదే ప్రచారమిచ్చింది.

సుందరయ్య, మద్రాసు యూత్‌లీగ్‌లోని ఇతర సభ్యులు మిగిలిన కాలేజీలు, హాస్టళ్ళ విద్యార్థులతో సంబంధాలు పెంచుకున్నారు. సోషలిస్టు, జాతీయ సాహిత్యాన్ని పంచేవాళ్లు. ఆ బృందం చర్చలలో కాంగ్రెస్ నాయకత్వంలోని జాతీయోద్యమం పట్ల అలాగే సంపూర్ణ స్వాతంత్రం పట్ల దాని వైఖరిపై తీవ్ర విమర్శ వచ్చింది. కేవలం రాజకీయ స్వాతంత్రం వచ్చినంత మాత్రాన దేశాన్ని పీడిస్తున్న సమస్యలు పరిష్కారం కావనే సాధారణ అభిప్రాయం వుండేది. విప్లవోద్యమమే మెరుగైన ప్రత్యామ్నాయమని, దాన్ని అనుసరించాలని నిర్ణయించుకున్నారు. అప్పటికి దేశంలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణం మొదలైంది. పెద్ద ఎత్తున కాకున్నా నిర్మాణం జరుగుతున్నది. కాంగ్రెస్ ప్రధాన స్రవంతి ప్రజా ఉద్యమానికి ప్రాతినిధ్యం వహిస్తున్నది. కనక యూత్‌లీగ్ సభ్యులు గ్రామాలకు వెళ్లి వ్యవసాయ కార్మికులు, పేద రైతాంగాన్ని సమీకరించాలని, పట్టణాలలో నగరాలలో కార్మికవర్గంలో కృషి చెయ్యాలని నిర్ణయించుకున్నారు.

వారు మరింత చురుగ్గా రాజకీయ సమీకరణ సాగించాలని నిర్ణయించుకున్న ఈ తరుణంలోనే జూనియర్ ఇంటర్మీడియట్ ఫైనల్ పరీక్షలు వచ్చేశాయి. సుందరయ్య, ఆయన స్నేహితులు ఈ పరీక్షలకు సిద్ధం కావలసి వచ్చింది. 1930లో జరిగిన ఆ పరీక్షలలో సుందరయ్య చాలా తేలిగ్గానే పై తరగతిలోకి ప్రమోట్ అయ్యాడు. పరీక్షలు ముగియగానే అనుకున్న ప్రకారం స్వంత వూరు వెళ్ళి సాంఘిక రాజకీయ కార్యకలాపాలు ప్రారంభించాడు. అందులోనూ దళితులు వ్యవసాయ కార్మికుల కోసం పని చేయడం ప్రారంభించాడు.

## సాంఘిక సంస్కరణ, సత్యాగ్రహం

గ్రామం వెళ్ళిన వెనువెంటనే సుందరయ్య యువజన బృందం ఒకటి ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకున్నాడు. తొలి కార్యక్రమంగా వేమన జయంతి రోజున

సహపంక్తి భోజనం ఏర్పాటు చేశారు. వ్యవసాయ కార్మికులు, బలహీన వర్గాలకు చెందిన వారిని భోజనానికి రమ్మని ఆహ్వానించారు. సుందరయ్య దాయాదులతో సహా ఇతర భూస్వాములు విందులో పాల్గొన వద్దని వారిని బెదిరించారు. దాంతో విందుకు ఎవరూ రాలేదు. సుందరయ్య ఆయన బృందం చాలా సేపు ఓపిగ్గా ఎదురు చూసినా వారి ఆహ్వానాన్ని అందుకుని వచ్చేందుకు ఎవరూ సిద్ధం కాలేదు. దాంతో భూస్వాముల వైఖరిని నిరసించేందుకై సుందరయ్య గాంధేయ పద్ధతిలో నిరాహారదీక్ష మొదలుపెట్టాడు. తల్లి వచ్చి నిరాహారదీక్ష విరమించాల్సిందిగా కోరింది గాని వినలేదు. ఈ సత్యాగ్రహం దళితులపై బ్రహ్మాండమైన ప్రభావం చూపింది. సుందరయ్య సాంఘిక సమానత్వం కోసం తమ సంక్షేమం కోసం నిలబడతాడని వారు గుర్తించారు.

అవి (1930) గాంధీజీ పిలుపుపై పల్లెల నుండి, పట్టణాల నుండి యువకులు తండోపతండాలుగా వచ్చి శాసనోల్లంఘన ాద్యమంలోకి చేరుతున్న రోజులు. ఈ సందర్భంగా పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం తాలూకా లింగనబోయినచర్లలో (ఎల్.బి.చర్ల) ఒక ప్రధానమైన సత్యాగ్రహ శిబిరం నడిచింది. అందులో జాతీయ వాదులు, బ్రహ్మ సమాజం నాయకులు, చాగల్లు ఆనందనికేతన్ వారు, సోదర సమితి వారు అనేక మంది వుండేవారు. ఆ శిబిరంలో చేరవలసిందిగా సుందరయ్యను కూడా ఆహ్వానించడంతో వెళ్ళి చేరారు. ఒక రోజు వలంటీర్లందరినీ బార్లుగా తీర్చి సుందరయ్యగారు డ్రిల్లు చెబుతుండగా ఒక పెద్ద మనిషి బైటవారితో మాట్లాడుతుండడం కన్పించింది. వెంటనే సుందరయ్య ఆయన రెక్కపట్టుకొని లైనులో నుండి బైటకులాగి "మీ వ్యవహారం బైట చూసుకొని రండి, డ్రిల్లు క్రమశిక్షణకు భంగం వచ్చేటట్లు ప్రవర్తించవద్దు" అని చెప్పారు. ఆ పెద్ద మనిషి భూపతిరాజు సోమరాజు. జిల్లాలో పెద్ద పలుకుబడిగల కాంగ్రెస్ నాయకుడు. ఆయనకు అరవై ఏళ్ళు, ఈయనకు పదిహేడేళ్ళు. అయినా కాని ఈ యువకుని సాహసాన్ని ఆయన ఆనందంతోనే స్వీకరించారు తప్ప అలగలేదు

శిబిరంలో ధనవంతుల బిడ్డలు, పేదవాళ్ళు అందరూ వున్నారు. కొందరికి కట్టుకొన్న బట్టలు తప్ప మరేమీ వుండేవి కావు. ఆ అసమానతను చూచిన సుందరయ్య తన వద్ద అదనంగా వున్న బట్టలు, మనీపర్సు దళాధిపతికిచ్చి "మనం స్వాతంత్ర్య పోరాట సైనికులం, మనదంతా దళం ఉమ్మడి సొమ్ముగా వుండాలి" అని చెప్పారు. దానికి శిబిరాధిపతులు ఆయన్ని అభినందించి, అంతా ఇదే విధంగా చేయాలని ప్రోత్సహించారు.

ఒకరోజు చాగల్లు ఆనంద నికేతన్ పాకలు పోలీసులు కూల్చివేస్తే పరిశీలించడానికి సుందరయ్య వెళ్ళారు. ఆ రాత్రే 17 మంది వలంటీర్లను అరెస్టు చేసి,

భీమవరం డిప్యూటీ కలెక్టర్ కోర్టులో 6 నెలలు శిక్ష విధించారు. వారు జైలులో వుండగానే ఒక సాహసోపేతమైన ఘటన జరిగింది. శాసనోల్లంఘన కార్యక్రమంలో తాటిచెట్లు నరికే కార్యక్రమంలో భాగంగా చాలా చాలా పొడుగైన తాటిచెట్టుపై జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని నిర్ణయించారు. దానికి సుందరయ్యగారు ఆ పని నేను చేస్తానని జెండా తీసుకొని ఎక్కడం మొదలు పెట్టారు. మధ్యలో పట్టుతప్పి కొంత క్రిందకు జారారు. గుండె అంతా కొట్టుకుపోయి నెత్తురు కారుతోంది. అయినా తన పట్టుదల వదలక మళ్ళీ ఎక్కడం ప్రారంభించి చివరికి చెట్టుపై పతాకాన్ని ఎగురవేశారు. ఈ అపూర్వ సాహసాన్ని గురించి ఆ రోజుల్లో అంతా కథలుగా చెప్పుకునేవారు. ఈ ఘటనతో ఆ ప్రాంతపు జాతీయవాదులంతా జాతి ప్రతిష్ఠను నిలబెట్టిన వారిగా సుందరయ్యగారిని, గౌరవభావాలతో చూసేవారు. అనంతరకాలంలో ఆ జెండా పీకించడానికి ఎంతకూ సాధ్యం గాక పోలీసువాళ్ళు తుపాకులతో కాల్చి ఆ జెండాను తగులబెట్టవలసి వచ్చింది.

1930లో సుందరయ్యకు మొదటి సారి జైలు జీవితం చూశాడు. తాటిచెట్లను నరికేయడం ద్వారా శాసనోల్లంఘనకు పాల్పడినందుకు ఆయనను మరికొందరని అరెస్టు చేశారు. 18 ఏళ్ల లోపు వయసున్న మరో ముగ్గురిని కూడా ఆయనతో కలిపి తంజావూరు బాల నేరస్తుల జైలు(బోర్టుల్ స్కూల్) కు పంపించారు. మిగిలిన వారిని ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలోని ఇతర జైళ్లకు పంపించారు. తర్వాత కోర్టు జోక్యంతో వయస్సు తక్కువున్న ఖైదీలను రాజమండ్రికి మార్చారు. అక్కడ ఖైదులో వున్నప్పుడే సుందరయ్య సోషలిస్టు, కమ్యూనిస్టు ఖైదీలతో సంబంధాలేర్పడ్డాయి. భగత్ సింగ్ సహచరులైన శివ వర్మ వంటివారిని అక్కడే కలుసుకోగలిగాడు. విడుదలైన తర్వాత ఆయన తన బావ పనిచేస్తున్న బెంగుళూరు వెళ్ళాడు. అప్పుడున్న పరిస్థితులు కూడా తక్షణమే రాజకీయ కార్యకలాపాలు సాగించడానికి వీలుగా లేవు. అందుకే సుందరయ్య తన తల్లిగారి సలహా మేరకు ముందు చదువు పూర్తి చేసుకుని తర్వాత రాజకీయ కృషి చేపట్టాలని భావించాడు.

## అమీర్ హైదర్ ఖాన్- కమ్యూనిస్టుపార్టీ

ఆయన బెంగుళూరులో వున్నప్పుడే భారత కమ్యూనిస్టు ఉద్యమ ప్రారంభకులలో ఒకరైన అమీర్ హైదర్ ఖాన్ సుందరయ్యను కలసి కమ్యూనిస్టుపార్టీలో చేరవలసిందిగా ఆహ్వానించాడు. అప్పటికి సుందరయ్య కమ్యూనిస్టు సిద్ధాంతానికి బాగా సన్నిహితంగా వున్నా తన తల్లికి చేసిన వాగ్దానం మేరకు ముందు చదువు పూర్తి చేయకుండా రాజకీయాలలో చేరడంపై పూర్తిగా మాట ఇవ్వలేనని బదులిచ్చాడు. అయితే చదువు కొనసాగిస్తూనే పార్టీకోసం చేయగలిగిందంతా చేయడానికి అంగీకరించాడు.

ఆ ప్రతిస్పందననే అమీర్ హైదర్ ఖాన్ ఆమోదంగా తీసుకున్నాడు. ఆ విధంగా సుందరయ్య బ్రిటిష్ వలస పాలకుల నిషేధాన్ని ఎదుర్కొంటున్న కమ్యూనిస్టు పార్టీలో చేరాడు. ఖాన్ దక్షిణ భారత దేశంలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి బాధ్యుడుగా వున్నాడు. తను అరెస్టయిన పక్షంలో ఆ కర్తవ్యం కొనసాగించాలని ఆయన పిఎస్‌కు చెప్పాడు.

తర్వాత దేశంలో రాజకీయ పరిణామాలు వేగంగా మారిపోయాయి. బెంగుళూరులో అక్కయ్య ఇంట్లోనూ మార్పులొచ్చాయి. సుందరయ్య తల్లికి ఇచ్చిన మాట నిలబెట్టుకోలేని పరిస్థితులు వచ్చాయి.బావ కూతురు వివాహం సందర్భంగా బ్రిటిష్ పతాకాన్ని ఇంటిపై ఎగరేయడాన్ని నిరసిస్తూ సుందరయ్య ఆ ఇంట్లోంచి బయిటకు వచ్చేశాడు. దాంతో చదువు కూడా ఆగిపోయింది. తన స్వగ్రామం వెళ్ళి కార్యక్రమాల్లో మునిగిపోయాడు. ఆ సమయంలోనే కొన్ని ఇంటి సమస్యలు కూడా పరిష్కారం చేసుకున్నాడు.

ఈ లోపల అమీర్ హైదర్‌ఖాన్, వి.కె. నర్సింహన్ వంటి ముఖ్య నాయకులంతా అరెస్టయినట్టు పత్రికల ద్వారా తెలిసింది. వారిపై కుట్ర కేసు బనాయించారు. అమీర్ హైదర్ ఖాన్‌ను జైల్లో వెళ్ళి కలుసుకోవడం వల్ల అనవసరంగా అంతా పోలీసులకు తెలిసిపోతుంది గనక వెళ్లకుండా నిభాయించుకున్నాడు. ఈ లోగా లండన్ రౌండ్ టేబిల్ కాన్ఫరెన్స్ విఫలమవడంతో మళ్ళీ జాతీయోద్యమం ఉధృతమయ్యే సూచనలు కనిపించాయి. తిరిగి వచ్చిన గాంధీజీ ఉద్యమ పునరుద్ధరణకు పిలుపునిచ్చారు. ఆ సమయంలో సుందరయ్య వూళ్ళో యువకులను మరింతగా సమీకరించాలని నిర్ణయించుకున్నాడు. పేద రైతులు, వ్యవసాయ కార్మిక ఉద్యమాలను ప్రారంభించి కొన్ని తక్షణ సమస్యలనైనా ఎలుగెత్తే ప్రయత్నం చేశాడు. యువజనుల ద్వారా నిర్మాణ కృషి సాగించవచ్చనేది ఆయన ఆలోచన. ఆయన నాయకత్వంలో యువజనులు గ్రామంలో ఒక గ్రంథాలయాన్ని, ఒక సహకార దుకాణాన్ని, ప్రాథమిక పాఠశాలను, వైద్యశాలను నెలకొల్పారు.అవి ప్రజలకు ఎంతగానో సేవ చేయడమే గాక సుందరయ్యను మరింత ప్రేమ పాత్రుణ్ని చేశాయి. వాటికోసం ప్రజలు దూర ప్రదేశాల నుంచి కూడా వచ్చేవారు.

విప్లవ రాజకీయాలు అనుసరించాలని భావిస్తున్నందువల్ల భూమితో సహా ఆస్తిపాస్తులు అట్టిపెట్టుకోవడం అర్థం లేనిదని భావించాడు. 1932 లో ఈ సమస్యలన్ని పరిష్కారం చేసుకున్నాడు. అన్న యింతకాలం పొలం చూసుకుంటూ, చదువు చెప్పించాడు గనక తన వాటా ఆస్తి, భూములు కూడా తనే పెట్టుకోవచ్చని దానికి బదులు తనకు

కొంత న్యాయమైన మొత్తం ఇస్తే చాలని సుందరయ్య చెప్పాడు. తనకు కుటుంబం నుంచి వచ్చిన మొత్తం డబ్బును పార్టీకి ఇచ్చాడు. ఇంటిని సంఘ కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు లైబ్రరీ, పాఠశాల, యువజన సంఘం నడుపుకునేందుకు ఉపయోగించుకున్నాడు. అయితే అన్నయ్య 1948లో చనిపోయే వరకూ ఆయనకు ఆర్థికంగా సహకరిస్తూనే వచ్చాడు.

సుందరయ్యకు జాతీయ విప్లవ కారులు, యువ కాంగ్రెస్ నాయకులతో సహా విస్తారమైన సంబంధాలుండేవి. వారితో కలసి జైలు జీవితం గడిపినప్పుడు ఏర్పడిన పరిచయాలవి. వారికి మార్క్సిస్టు సాహిత్యం, కమ్యూనిస్టు ఉద్యమంతో పరిచయం కలిగించేవాడు. గాంధేయ వాదాన్ని నిరుత్సాహపర్చేవాడు. నిర్మాణ కార్యక్రమాల కోసం తను సమీకరించిన కొంతమంది యువజనుల సహాయంతో ఆయన చిన్న చిన్న పుస్తకాలు అనువాదం చేయడం ప్రారంభించాడు. వాటిని అందరికీ పంపిణీ చేసేవాడు. ఆ సమయంలో బ్రిటిష్ గూఢచారులు ఆయనను ప్రమాదకరమైన కమ్యూనిస్టు అని అభివర్ణించారు.

1932లో గాంధీజీ కమ్యూనల్ అవార్డుకు వ్యతిరేకంగా దేశ వ్యాపిత పర్యటన జరుపుతూ సుందరయ్య వూరికి చుట్టు పక్కల గ్రామాలకు వచ్చాడు. భూస్వాముల ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించే జస్టిస్ పార్టీ ఆయన సభలపై దాడి చేస్తున్నందున వారిని ఎదుర్కొవడానికి సుందరయ్యను ఆయన స్నేహితులను వలంటీర్లుగా నియమించారు. దాంతో భూస్వాములు ఇంక దాడికి సాహసించలేదు. అంతా ప్రశాంతంగా జరిగిపోయింది. ఇది ఇంకా ఇలాటి అనేక పద్ధతుల్లో పిఎస్ ఆయనతో వున్న ఉత్సాహ వంతులైన యువత భూస్వాములకు వ్యతిరేకంగా వ్యవసాయ కార్మికులను పేద రైతులను సమీకరించారు. ఆ రోజుల్లో అనేక విజయాలు కూడా సాధించారు.

## సామాజిక అన్యాయాలపై పోరాటం

సుందరయ్య ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు వుండటం వల్లనే భారత దేశపు సామాజిక వాస్తవాలపై అవగాహన పెంచుకోగలిగాడు. 1932లో అమీర్ హైదర్‌ఖాన్, వి.కె.నరసింహన్, రాజా వడివేలు తదితరులను అరెస్టు చేసి జైలులో పెట్టారు. దాంతో కమ్యూనిస్టుగానే కార్యక్రమాలు నిర్వహిద్దామని నిశ్చయానికి వచ్చాడు .ఆయన తీసుకున్న ఈ నిర్ణయమే ఆయన జీవితంపై చివరి వరకూ ప్రభావం చూపించింది. గ్రామంలోనే వుండి వ్యవసాయ కార్మికులను పేద రైతులను సంఘటితపర్చాలని భావించాడు.

గ్రామంలోనే పెరిగి పిల్లవాడుగా కుటుంబంలో పనిచేసిన కారణంగా ఆయనకు పొలం పనుల గురించిన పరిజ్ఞానం వుండేది. పిఎస్ కొద్ది కాలంలోనే పొలం పనులకు సంబంధించిన నైపుణ్యాలన్నీ నేర్చుకున్నాడు. ఇప్పుడు రైతులు వ్యవసాయ కార్మికులతో కలసి పనిచేయడం ద్వారా మరింత అనుభవం సంపాదించుకోసాగాడు. పొద్దస్తమానం నడుంవంచి నాట్లు వెయ్యడం, వీపుపై బాగా బరువులు మోయడం అలవాటు చేసుకున్నాడు. అయితే నడుంవంచి నాట్లు వెయ్యటం ఆయనకు బాగా కష్టంగా వుండేది. వ్యవసాయ కార్మికుల జీవితాలలో శారీరక బాధ ఎలా భాగంగా స్వీకరించవలసి వుంటుందో ఆయన స్వయంగా తెలుసుకున్నాడు. వాళ్ళ ఇంట్లో ప్రధాన పాలేరుగా వున్న ఆర్.పిచ్చయ్యతో దీనిపై జరిగిన సంభాషణను ఆయన తన ఆత్మకథలో నమోదు చేశాడు. కొత్త గనుక నీవు చెప్పే నొప్పి కూలీలందరికీ ఉంటుంది. అయితే అలా కష్టపడి పని చేస్తేనే ఇల్లు గడవడానికి సొమ్ములు, వస్తాయి గనకే ఎలాగో భరిస్తారు అని అతను చెప్పాడట. సుందరయ్య ఇలా శ్రామికులతో కలసి మెలసి తిరగడం భూస్వాములకు కోపం తెప్పించినా ఆయనేమీ పట్టించుకునే వాడు కాదు.

ఇప్పటికే చెప్పుకున్నట్టుగా తీవ్ర కుల వివక్ష అమలు జరుగుతుండేది.దానికి వ్యతిరేకంగా ఇంట్లోనూ సమాజంలోనూ సుందరయ్య నిరంతరం పోరాడేవాడు. పొలం పని విషయానికి వస్తే ఆయన నాట్ల తరుణంలో ఆరుగంటలు ఓపిగ్గా పని చేసేవాడు.అలా కొంత కాలం పనిచేసిన తర్వాత నాట్ల కట్టలు పొలంలో అటూ ఇటూ చేరవేసే పని పెట్టుకునేవాడు. ఇంటి నుంచి కావడిలో వాళ్లకు అన్నంతెచ్చే పనితీసుకునేవాడు. ఇక్కడ కూడా మళ్లీ తల్లితో ఎప్పుడూ తగాదానే. ఆమె పొలానికి అన్నం పంపిస్తే తనకొక్కడికే ప్రత్యేకంగా పంపడాన్ని తప్పు పట్టేవాడు. వీపుపై భుజాలపై బరువులు మోయడం బాగా ఆలవాటై పోయింది.ఈ అనుభవాలన్ని పేద రైతులు, వ్యవసాయ కార్మికుల తరఫున కోర్కెల పత్రం రూపొందించడంలో ఆయనకు సహాయపడ్డాయి.

ఈ కాలంలోనే పిఎస్ మహిళలు ఎదుర్కొనే సమస్యల గురించిన ప్రత్యేక చైతన్యం పెంచుకోగలిగాడు. కుర్రవాడుగా వున్నప్పుడే ఆయన వృద్ధులకు బాలికలనిచ్చి వివాహం చేయడానికి వ్యతిరేకంగా పోరాడాడు. తన అక్కయ్యను వయసు మళ్ళిన వాడికి ఇచ్చి చేయడాన్ని వ్యతిరేకించాడు. తర్వాత ఆ వచ్చిన బావ తన పట్ల చాలా సానుభూతిగా వున్నా ఈ విషయంలో ఆయన అభిప్రాయాలు మారలేదు. వ్యవసాయ కార్మిక కుటుంబాల స్త్రీల దారుణమైన అనుభవాల పట్ల ఆయన ప్రత్యేకమైన నిశితమైన శ్రద్ధ కనపర్చేవాడు. పొలంలో పని చేస్తున్న రోజులలో పాలేర్లు మాట్లాడుతున్నప్పుడు

భూస్వాములు ధనిక రైతులు ఏ విధంగా తమ స్త్రీలను వేధించేది, అత్యాచారాలు సాగించేది చెప్పేవారు. దీన్ని తాము ఏ విధంగా మౌనంగా నిస్సహాయంగా మౌనంగా భరిస్తున్నదీ కొన్నిసార్లు భూస్వాముల కుటుంబాలలో స్త్రీలపై ప్రతీకారం తీర్చుకునేది చెబుతుండేవారు. ఈ కథలు పిఎస్‌ను ఎంతగానో కదిలించేవి. స్త్రీలపై సాగే అన్ని రకాల లైంగిక దోపిళ్లపట్ల తనలో ఎంత అసహ్యం పెరిగిందొ ఆయన తన ఆత్మకథలో ఇలా రాసుకున్నాడు: " స్త్రీ పురుషులు ఇష్టపూర్వకంగా ఏదైనా చేస్తే అది పొరపాటు అయినప్పటికీ దానిపై పెద్ద రభస చేయనవసరం లేదు. కానీ ఒక పురుషుడు స్త్రీని బలవంతాన లోబర్చుకోవడం మాత్రం చాలా అనైతికం. దాన్ని ఎంత మాత్రం సహించకూడదు" ఇంకా ఇలా రాశారు: "స్త్రీలపై సాగే లైంగిక దోపిడీ, వారిని అనేక రకాల చిత్రహింసలకూ దుర్భాషలకూ గురి చేయడం చూసి నేను మహిళా విముక్తి,సమానత్వం అనే భావాలను గట్టిగా స్వీకరించాను".

తర్వాత కాలంలో తెలంగాణా పోరాట కాలంలో సుందరయ్య మహిళా కార్యకర్తల అభివృద్ధి పట్ల ప్రత్యేక శ్రద్ధ కనపర్చాడు.నిజాంకు వ్యతిరేకంగా దళాలలో వారిని చేరవలసిందిగా ఆయన వారిని ప్రోత్సహించాడు. అదే సమయంలో వారి సంక్షేమం గురించి కూడా అంతే శ్రద్ధ చూపాడు. ఆయన సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి అయ్యాక మహిళా కార్యకర్తల అభివృద్ధి విషయమై పార్టీ కమిటీలు, శ్రేణులకు చైతన్యం కలిగించేందుకు ప్రత్యేక అంశంగా చేపట్టారు.

## దక్షిణ భారతదేశంలో పార్టీ నిర్మాణం

1934 లో అమీర్ హైదర్‌ఖాన్ జైలు నుంచి విడుదలవ్వగానే సుందరయ్య మద్రాసుకు వెళ్ళికలుసుకున్నాడు. ఆయన ఒక డాక్యుమెంటు ఇచ్చి ఆ అవగాహన ప్రకారం పార్టీని ఏకీకృతం చేయాలని చెప్పాడు. 1933–34 మధ్య పిఎస్ దక్షిణ భారత దేశంలో వివిధ జిల్లాలు పర్యటించాడు. ఆ రోజుల్లో జాతీయోద్యమంలో చేరిన చాలా మంది యువకులు జైళ్లలోని జాతీయ విప్లవ కారులతో సంబంధాలు కలిగివుండేవారు.(వారిలో చండ్ర రాజేశ్వరరావు, నండూరిప్రసాదరావు వంటి వారున్నారు) అలాటివారందరి జాబితా ఒకటి పిఎస్ తయారు చేసుకున్నాడు. వారందరినీ విడివిడిగా కలుసుకున్నాడు.మద్రాసు యూత్ లీగ్ సభ్యులతో సహా వారంతా కలసి లాంఛనంగా ఒక బృందంగా ఏర్పడాలని నిర్ణయించుకున్నారు. విజయవాడలో వారంతా పోలేపెద్ది నరసింహమూర్తి కార్యదర్శిగా ఒక కమిటీని ఎన్నుకున్నారు.నెమ్మదిగా కోస్తా ఆంధ్ర ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీ విస్తరించింది.

అమీర్ హైదర్‌ఖాన్ అరెస్టు తర్వాత ఉద్యమాన్ని సమీకరించి సంఘటితం చేసే బాధ్యత సుందరయ్య భుజాలపై పడింది. ఖాన్ సలహాల ప్రకారం ఆయన

బొంబాయిలోని కేంద్ర కమిటీ సభ్యులతో సంబంధాలు పెట్టుకున్నాడు.తమ వూరి నుంచి మద్రాసుకు మారాడు. పార్టీ నిర్మాణావసరాల కొరకు ఒక కార్యాలయం అద్దెకు తీసుకున్నాడు. క్రమేణా వారు రాజకీయ కార్యకలాపాలను బహిరంగంగా సమన్వయం చేసుకోవడం కోసం కూలి రక్షణ సమితి అనేది స్థాపించారు. పిఎస్ ఎంతో మందిని పార్టీ పరిధిలోకి తీసుకొచ్చాడు.ఆయన కొద్దికాలంలోనే జమ్మడి మద్రాసు రాష్ట్ర పార్టీ కమిటీ కార్యదర్శి అయ్యాడు.

1934 అక్టోబర్‌లో ఆయనను బొంబాయి వచ్చి చర్చించవలసిందిగా ఆహ్వానించారు. అప్పుడే ఆయనను, అజయ్ ఘోష్‌ను లాంఛనంగా పార్టీ కేంద్ర కమిటీలోకి తీసుకున్నారు. పిఎస్ జీవిత పర్యంతం కేంద్ర కమిటీ సభ్యుడుగా వుండిపోయారు. బహుశా అలాటి వారు కమ్యూనిస్టు ఉద్యమంలో మరెవరూ లేరు. అదే ఏడాది ఆయన కిసాన్ సభ వ్యవస్థాపక సభ్యుడయ్యాడు. చాలా ఏళ్లపాటు సహాయ కార్యదర్శిగా వున్నాడు.

ఆ సమయంలోనే జాతీయ కాంగ్రెస్ మహాసభ జరగవలసి వుంది. కాంగ్రెస్‌లో వున్న జయప్రకాశ్ నారాయణ, నరేంద్రదేవ్, యూసఫ్ మెహరాలీ, అచ్యుత పట్వర్థన్ తదితర సోషలిస్టు నాయకులు గాంధీజీ రాజకీయ పంథాతో విభేదించారు. కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ ఏర్పరుస్తున్నట్టు ప్రకటించారు. కమ్యూనిస్టులుగా ఉన్నవారు కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ పట్ల ఏ వైఖరి తీసుకోవాలి అన్నది అప్పటికింకా ఏకాభిప్రాయం లేదు. అయితే ఆ పార్టీలో చేరిన వారిలో చాలా మంది సుప్రసిద్ధులైన ఇఎంఎస్ నంబూద్రిపాద్, పి.కృష్ణపిళ్లె, ఎ.కె.గోపాలన్‌లతో సహా తర్వాత కమ్యూనిస్టులైన సంగతి తెలిసిందే.

**ఆ రోజులను గురించి ఇఎంఎస్ ఇలా రాశాడు :**

1935 సెప్టెంబర్, అక్టోబరు మధ్య కాలంలో దాదాపు 50 సంవత్సరాల క్రితం మొట్ట మొదటిసారిగా నేను కామ్రేడ్ సుందరయ్యను కలుసుకున్నాను. కమ్యూనిస్టులు, కాంగ్రెస్ సోషలిస్టులు, ఇతర వామపక్షవాదులు మద్రాసులో ఒక సమావేశాన్ని జరుపుతున్నారు. మలబారు నుండి కాంగ్రెస్ సోషలిస్టుల తరపున నేనూ, కీర్తిశేషులు కామ్రేడ్ కృష్ణపిళ్ళై హాజరయినాము. ఆ సమావేశానికి హాజరయిన కమ్యూనిస్టులకు కామ్రేడ్ సుందరయ్య నాయకత్వం వహించారు. సమావేశం ముగిసిన తర్వాత నేనూ, కృష్ణపిళ్ళై కామ్రేడ్ సుందరయ్యను కలుసుకొని కొద్దిసేపు మాట్లాడాము. తాను కాలికట్ వస్తానని, అక్కడ సుదీర్ఘమయిన చర్చలు జరుపుకోవచ్చునని, వీలుంటే కేరళలోని ఇతర కామ్రేడ్లను కూడా కలుసుకుంటానని సుందరయ్య చెప్పారు.

నేను ఒక కమ్యూనిస్టుతో తీవ్రంగా చర్చించడం అదే మొదటిసారి. బొంబాయిలో



ఎడమ నుండి : ఎ.కె. గోపాలన్, ఇ.ఎమ్.ఎస్. నంబూద్రిపాద్, పి. సుందరయ్య

జరిగిన కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ వ్యవస్థాపక మహాసభలో కమ్యూనిస్టులు తమ వైఖరిని ఉపన్యాసాల ద్వారాను, ముసాయిదా తీర్మానాలకు సవరణలను ప్రతిపాదించడం ద్వారాను శక్తివంతంగా ప్రతిబింబించారు. కామ్రేడ్ సుందరయ్య చర్చలలో చురుకుగా పాల్గొనకపోయినప్పటికి ఆ సమావేశానికి హాజరయినట్లు తెలుసుకున్నాను. కమ్యూనిస్టులు కాంగ్రెస్ పార్టీని పూర్తిగా వ్యతిరేకిస్తారని, అందుమూలంగానే వారు కాంగ్రెస్ సోషలిస్టు పార్టీపై పోరాడుతున్నారని కాంగ్రెస్ సోషలిస్టు పార్టీని ఏర్పాటు చేసిన మిత్రులు తెలియచేశారు. మేము కాని, కమ్యూనిస్టులు కాని కలుసుకొని సమస్యలపై చర్చించే కృషి జరపలేదు.

కృష్ణపిళ్ళేను, నన్నూ ఎంతో ప్రభావితం చేసిన ఆ మొదటి సమావేశాన్ని మరువలేను. ముమ్మూర్తులా నిజమైన విప్లవకారుణ్ణి మేము సుందరయ్యగారిలో చూడగలిగాము. నిరాడంబరత, రాజకీయ అభిప్రాయాల పట్ల ధృఢవైఖరి, ఎదుటివారు చెప్పేదానిని శ్రద్ధగా ఆలకించడం, వారి సమస్యలను అర్థం చేసుకోవడం, వాటిని అధిగమించడానికి, సాయపడడానికి ఆతృత చూపడం మా హృదయాలలో శాశ్వత ముద్రను వేశాయి. సుందరయ్యగారి జీవితాంతం ఆయనను కలుసుకున్న ప్రతిసారి అదే అనుభూతి పొందాం."

పిఎస్, అలాగే అనేక మంది ఇతర కమ్యూనిస్టులు సోషలిస్టులు కమ్యూనిస్టుల మధ్య విశాల వేదిక నిర్మించాలనే పార్టీ నిర్ణయం ప్రకారం కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలో చేరారు. సుందరయ్య ఆంధ్ర కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ కార్యదర్శిగా కూడా ఎన్నికైనాడు. 1938లో లాహోర్‌లో జరిగిన ఆ పార్టీ జాతీయ సదస్సుకు ఆంధ్ర ప్రతినిధిగా హాజరైనాడు కూడా. అయితే 1939-40 రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో కమ్యూనిస్టులను కాంగ్రెస్ సోషలిస్టు పార్టీనుంచి తొలగించడమో వారే వైదొలగడమో జరిగింది. బ్రిటిష్ ఆ రోజుల్లో ప్రభుత్వం పట్ల అనుసరించాల్సిన వైఖరిపై విభేదాలే అందుకు కారణమైనాయి. సోషలిస్టులు ఇంచుమించుగా గాంధేయ విధానంలాగే సహాయ నిరాకరణ, వ్యక్తి సత్యాగ్రహం అనే వైఖరిని తీసుకోగా కమ్యూనిస్టులు యుద్ధాన్ని పూర్తిగా వ్యతిరేకించాలన్నారు.

సుందరయ్య అనేక కరపత్రాలు రాశాడు. కమ్యూనిస్టు పార్టీని నిర్మించే తన కృషిలో భాగంగా డజన్ల కొలది బహిరంగ సభల్లో మాట్లాడుతూ ప్రజలను కలుసుకుంటూ దక్షిణ భారతమంతా తిరిగాడు. ఆయన ఉపన్యాస శైలి అప్పటికప్పుడు చప్పట్లు కొట్టించేదిగా లేకపోయినా విషయ ప్రధానంగా సమాచార సమగ్రంగా వుండేది. కనకనే ఆయన ఉపన్యాసాలలోని విషయం ఆకర్షించకుండా పోయే ప్రసక్తి వుండేది కాదు. ఒక సందర్భంలో 3000 మంది గీత కార్మికులు పాల్గొన్న ప్రదర్శనలో ఇచ్చిన డిమాండుపై అపార్థాలు తలెత్తితే సుందరయ్య వెనువెంటనే అది ప్రజల ప్రయోజనాలకు వ్యతిరేకమైంది కాదంటూ ఒక కరపత్రం విడుదల చేశాడు. మరోసందర్భంలో ఆయన భూస్వాములు పెట్టుబడిదారుల వైఖరిని ఖండిస్తూ హక్కుల కోసం పోరాడవలసిందిగా కార్మికులకు పిలుపునిస్తూ ఒక కరపత్రం రాశాడు. అది దేశ ద్రోహమంటూ ప్రభుత్వం నిషేధించింది. ఆ కరపత్రాన్ని కూలి రక్షణ సమితి వివిధ భాషలలోకి అనువదించి విస్తారంగా పంపిణీ చేసింది. దాన్ని రాసినందుకు సుందరయ్యపైన, పంచిపెట్టినందుకు సమితి సభ్యులపైన ప్రభుత్వం కేసు పెట్టింది.

సుందరయ్యపై నిరంతరం పోలీసు నిఘా వుండేది. రాజమండ్రి సోషలిస్టు పార్టీ మహాసభలో చేసిన ప్రసంగానికి గాను ఆయనను రాజద్రోహం కింద అరెస్టు చేశారు. ఈ కేసులో రెండేళ్ల శిక్ష పడింది గాని మద్రాసు హైకోర్టులో అప్పీలు చేస్తే బెయిలు లభించింది.

యువకుడుగా వున్నప్పుడే సుందరయ్య రాజకీయ ప్రత్యర్థులను నిర్భయంగా ఎదుర్కొనేవాడు. వారెంత ప్రముఖులైనా సరే తన రాజకీయ విశ్వాసాల విషయంలో

రాజీ పడేవాడు కాదు. ప్రసిద్ధ కాంగ్రెస్ నాయకుడు, ఆంధ్రకేసరి ప్రకాశం పంతులు 1930లలో ఒకసారి సభలో సోషలిజాన్ని గురించీ, సోవియట్ యూనియన్‌ను గురించీ నిందాపూర్వకంగా మాట్లాడుతున్నారు. సుందరయ్యగారు ఆగలేక "అబద్ధం" అని కేకేశాడు. ప్రకాశం పంతులుగారి స్వభావాన్ని ఎరిగిన వాళ్ళు ఆయన ఏమి విరుచుకుపడతారో అనుకున్నారు. ప్రకాశంగారు వెంటనే ఉపన్యాసాన్ని ఆపి "ఎవరది?" అని కేకేశారు. సుందరయ్యగారు లేచి, "నేను పుచ్చలపల్లి సుందరయ్యను" అని చెప్పి, సోవియట్ యూనియన్ గురించి మీరు చెప్పేది అబద్ధం అని అన్నారు. ఆ విధంగా సుందరయ్యగారు తప్ప ప్రకాశంగారికి మరెవరూ ఎదురు చెప్పగలిగి వుండేవారు గాదు. ప్రకాశంగారు నిస్తబ్ధుడైనాడు. "సుందరయ్య సుందరయ్య" అని రెండు సార్లు గొణిగి, "నీవు పుట్టక ముందే నేను రష్యా వెళ్ళి వచ్చాను" అని తన ప్రసంగ ధోరణిని పూర్తిగా మార్చేశారు. నిజానికి ఆయన ఎన్నడూ సోవియట్ వెళ్లింది లేదు.

## అజ్ఞాత జీవితం- మార్మోగోవా సాహసం

1937, 38 సంవత్సరాలలో సుందరయ్య ఆంధ్రలోని వివిధ జిల్లాలలో బలమైన కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మించేందుకు ఎంతగానో శ్రమించాడు. 1937లో నవశక్తి తెలుగు వార పత్రిక ప్రారంభమైంది. ఎల్.బి.గంగాధరరావు,మోటూరు హనుమంతరావు తదితరులు ఈ కాలంలో ఉద్యమంలో చేరారు. తనపై నిరంతరం నిఘా వున్నప్పటికీ సుందరయ్య నిర్విరామంగా అజ్ఞాతవాసంలోనే పనిచేస్తుండేవాడు. 1939లో రెండవ ప్రపంచ యుద్ధం వచ్చాక ప్రభుత్వం పోలీసుల నిఘా మరింత పెరిగింది. పిఎస్ స్వతంత్ర భారత్ అనే సైక్లోస్టయిల్ పత్రిక తీసుకురావడానికి చొరవ తీసుకున్నారు. తనే సైకిల్‌పై దాన్ని అన్నిచోట్లకూ చేర్చేవారు. ఈ రహస్య కార్యకలాపాలు నిర్వహించినందుకు గాను ఎంతమంది అరెస్టయ్యారనేది ఇప్పటికీ ఆంధ్ర ప్రదేశ్‌లో కథలుగా చెబుతారు.

సుందరయ్య ఎలాటి సాహసాలకైనా వెనుకాడేవాడు కాదు. 1941లో ఆయన మార్మోగోవా నుంచి తప్పించుకున్న వైనం ఒక గొప్ప గాథ. బొంబాయిలో జరిగే పార్టీ కేంద్రకమిటీ సమావేశానికి రహస్యంగా వెళ్ళి వస్తానని సుందరయ్యగారు వెళ్ళారు. కాని వస్తానన్న రోజుకు తిరిగి రాలేదు. మాకు కొంచెం ఆందోళన కలిగింది. ఆలస్యంగా తిరిగి వచ్చిన సుందరయ్యగారి మొఖమంతా పీక్కుపోయి ఉంది. జబ్బునపడ్డ మనిషిలా ఉన్నారు. పైగా వట్టిచేతులతో వచ్చారు. ఏమిటని అడిగితే "దారిలో ఓ చిన్న సాహసం చేసి వచ్చాలే" అంటూ వివరించాడు..

బొంబాయి నుంచి తిరిగివస్తూ రూటు మార్చి మార్మగోవా మీదుగా వద్దామని బయలుదేరారు. మార్మగోవాలో రైలు మారాలి. మారే రైలుకు ఇంకా అయిదారు గంటలు వ్యవధి వుంది. స్టేషనులో ఊరికే కూర్చోవడం ఎందుకని తన బెడ్డింగును స్టేషనులోనే పెట్టి మార్మగోవా పట్టణంలోని చారిత్రక కట్టడాలను, ప్రదేశాలను చూసి వద్దామని వెళ్ళారు.

ఆ రోజులలో మార్మగోవా పోర్చుగీసు కాలనీగా ఉండేది. అందుకని అక్కడి నుంచి వచ్చే ప్రయాణీకులకు కస్టమ్స్ చెకింగ్ ఉండేది. దాని ప్రకారం రైలు బయలుదేరే ముందు సుందరయ్యగారి బెడ్డింగు కూడా చెక్ చేయాలన్నారు. తాను అక్కడి నుండి బయలుదేరడం లేదనీ, పై నుంచి వస్తున్న ప్యాసింజరుననీ వాదించారు. లాభం లేకపోయింది. చెక్ చేయవలసిందే అన్నారు అధికారులు. ఆ బెడ్డింగులో పార్టీ కేంద్రకమిటీ డాక్యుమెంట్లు గాన్నాయి. టైపు చేసిన కాగితాలే కదా ఏమీ పట్టించుకోరులే అనుకున్నారు సుందరయ్యగారు మొదట. కాని ఆ డాక్యుమెంట్లు చూసేసరికి కస్టమ్స్ అధికార్లకు కంగారు పుట్టింది. "ఎవరు నువ్వు? ఏమిటీ పత్రాలు?" అని ప్రశ్నించారు. తానొక 'లా' విద్యార్థిననీ, స్టడీ కోసం వాటిని తెచ్చుకుంటున్నానని జవాబు చెప్పారు. వాళ్ళకి ఏమీ తోచలేదు. ఈయనకు ఒక కుర్చీ ఇచ్చి కూర్చోమని చెప్పి, పోలీసు డిపార్టుమెంటుకు ఫోన్ చేశారు. పరిస్థితి చేయి జారిపోతున్నది. పోలీసులు వస్తే తనను వదిలిపెట్టరు. "ఏమైనా సరే వాళ్ళ చేతుల్లో చిక్కకూడదు" అనే నిర్ణయానికి వచ్చి చటుక్కున కుర్చీలోంచి లేచి పారిపోయారు. కస్టమ్స్ వాళ్ళకేమీ అర్థం కాలేదు. కస్టమ్స్ పోలీసులు సుందరయ్యగారి వెంటపడ్డారు.

ప్రక్కనే చిన్నకొండ వుంది. తర్వాత అడవి. వెంటపడ్డ వారి నుండి తప్పించుకొనేందుకని సుందరయ్య కొండపైకి పరిగెత్తాడు. తర్వాత క్రింద వున్న చిన్న లోయలో దట్టమైన అడవి వుంటే దూకి అడవిలోకి పారిపోయాడు, ఆ పోలీసులు లోయలోకి దూకేందుకు సాహసించలేదు. మామూలు పోలీసులకు తోడు అదనపు పోలీసులను కూడా పిలిపించుకున్నారు. అందరూ కలసి ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టి గాలింపు ప్రారంభించారు. చీకటి పడటంలో సెర్చ్‌లైట్లు వేశారు. అయినా ఫలితం లేకపోవడంతో ప్రస్తుతానికి వెనక్కు వెళ్ళి ఉదయాన్నే వచ్చి వెతకాలని నిర్ణయించుకున్నారు.

సుందరయ్యకు ఆ అడవి ప్రాంతంలో ఎటు పోవాలో తెలియదు కాని రాత్రిపూట ఆకాశంలో వుండే నక్షత్రాలబట్టి దిశ నిర్ణయించుకోవడం కొంచెం తెలుసు. రైల్వే ట్రాక్

ఎటు వుందో కూడా తెలుసు. ఈ రెంటినీ కలిపి ఆయన ఒక దిశలో నడవడం ప్రారంభించాడు. చివరకు ఎలాగో రైల్వే స్టేషన్ చేరుకోగలిగాడు. కనుక ఆ రాత్రంతా నేను ఎంచుకున్న దిశ వెంబడే అడవిలో ప్రయాణం చేశాను. ఎప్పుడూ ఆయన వద్ద ఓ చిన్న చాకును వుంచుకోవడం అలవాటు. ఏవన్నా చిన్న చిన్న మృగాల్లాంటివి అనుకోకుండా అడ్డంవస్తే వినియోగించుకొనేందుకు చాకును సిద్ధంగా వుంచుకున్నాడు.

రైల్వేస్టేషన్‌కి చేరేసరికి కాళ్ళు అరటిబోదెల్లా వాచిపోయాయి. దానికి తోడు కాళ్ళనిండా ముళ్ళు. ఇక ఏమాత్రం నడవటం సాధ్యమనిపించలేదు. కొంత దూరం పాకాడు. చివరకు ఎలాగో చిన్న పట్టణం రైల్వే స్టేషన్ చేరుకున్నాడు.

సుందరయ్య చేసిన ఒక తెలివైన పని ఏమంటే ఇన్ని అగచాట్ల మధ్యనా జేబులో డబ్బున్న పర్సును కాపాడుకున్నాడు. అదే చివరకు ఆయనను కాపాడింది. పొద్దున్నే షాపులు తెరిచే వరకూ నిరీక్షించి బట్టలు కొనుక్కోవడానికి వెళ్ళాడు. చొక్క ఎందుకు చినిగిపోయిందని దుకాణాదారు అడిగాడు. తానొక కలప వ్యాపారినని రాత్రి దొంగలు దోచుకున్నారని చెప్పాడు. మచిలీ పట్నం రైలు రావడానికి ఇంకా సమయం వుంది.ఆ పట్టణంలోనే వుండటం క్షేమ దాయకం కాదని ఒక టాక్సీ తీసుకున్నాడు. ఆ టాక్సీ పెట్రోలు బంకు దగ్గర ఆగినప్పుడే సుందరయ్యను వెతికే పోలీసుల వాహనం కూడా వచ్చి అక్కడ ఆగింది. వాళ్ళను చూడగానే ఆయనకు గుండె ఆగినంత పనైంది. తన పాట్లన్ని వృదా అయిపోయాయనిపించింది. అయితే ఆలోచనలు కూడగట్టుకుని మొహం శాలువాతో కప్పుకుని ఒక మూలగా కూచున్నాడు. తాము వెతుకుతున్న వ్యక్తి టాక్సీలో వస్తాడని పోలీసులు వూహించలేదు గనుక ఆయనను పట్టించుకోకుండా తమ దారిన తాము పోయారు. టాక్సీ మరో పట్టణానికి చేరుకోగానే సుందరయ్య దాన్ని వదలిపెట్టి రైల్వే స్టేషన్ చేరుకున్నాడు. ఎవరికీ అనుమానం రాకుండా ఫస్ట్ క్లాస్‌లో ఎక్కి తన గమ్యస్థానమైన ఆంధ్ర ప్రదేశ్ చేరుకున్నాడు. ఆయన పోలీసుల నుంచి తప్పించుకున్న తీరు నిజంగా ఒక అద్భుతం!

## లైలాతో వివాహం

1942-43 కాలంలో 'ప్రజాయుద్ధం' స్వభావాన్ని చర్చించే పత్రంపై చర్చించి తన సూచనలు కూడా చేసేందుకు సుందరయ్య బొంబాయిలోని పార్టీ కేంద్రానికి వెళ్ళాడు. అక్కడే తను పెళ్లాడబోయే లైలాను కలుసుకున్నాడు. అప్పటికి దేశవ్యాపితంగా



**మహారాష్ట్రకు చెందిన లీలమ్మను సుందరయ్య వివాహం చేసుకున్నాడు. 1943లో సుందరయ్య, లీలమ్మ దంపతులు**

కమ్యూనిస్టులపై నిషేధం ఎత్తివేసినా తెలంగాణాలో మాత్రం అది ఇంకా రహస్య సంస్థగానే వుంది. నిజాం ప్రభుత్వం దానిపై విచ్ఛిన్న శక్తిగా ముద్రవేస్తున్నది. రహస్య జీవితంలోని కామ్రేడ్స్‌తో సంబంధాలు నిర్వహించేపనిలో సుందరయ్య వుండేవాడు. అలాటి ఒక రహస్య కేంద్రంలోనే లైలా కలిశారు. రహస్య కామ్రేడ్స్ సంబంధాలు నెరపడానికి ప్రధాన బాధ్యులుగా వున్న దిల్‌షాద్ చారి, ఎ.ఎస్.ఆర్‌లతో ఆమె వుంటుండేది. లైలా అప్పటికి డిగ్రీ పూర్తి చేసి సెంట్రల్ బ్యాంకులో పనిచేస్తుండేది. లైలా తల్లి రహస్య కేంద్రంలో పార్టీ కామ్రేడ్స్‌కు వంట చేసి పెడుతూ సహకరించేది. ఆమెనంతా ఆప్యాయంగా థాయ్(పెద్దమ్మ) అని పిలిచేవారు. ఆమె ద్వారానే లైలా పార్టీ వైపు ఆకర్షితురాలై చురుగ్గా అంకితభావంతో పనిచేస్తున్నది. తర్వాత పార్టీపై నిషేధం తొలగిపోయి కేంద్రాన్ని తక్షణమే నిర్మించాల్సి వచ్చినప్పుడు చారి దంపతులు కేంద్రం పనిలోనూ కీలక పాత్ర పోషించారు. ఈ కృషిలో వారికి లైలా ఆమె తల్లి బాగా సహకరించారు. లైలా తన బ్యాంకు పనితో పాటు పార్టీ కేంద్రంలో వివిధ రకాల పనులు చేస్తుండేది.

అలా తమ రాజకీయ కార్యక్రమాలు నిర్వహించే సందర్భంలో లైలా , పిఎస్‌లు పరస్పరం ఆకర్షితులైనారు. 1943లో వివాహం చేసుకుందామని సుందరయ్య లైలాకు

చెప్పాడు. ఆమె అంగీకారం తెల్పింది. ఆయన్నెక్కువగా ఆకర్షించింది ఆమెలోని కష్టపడి పనిచేసే స్వభావం.'ప్రశాంత దాంపత్య జీవితం' తాలూకూ సాధారణ ఆకాంక్షలేవీ లేని కఠోర వ్యవహారంగా వుంటుందని తెలిసే ఆమె అంగీకరించింది. 1943 ఫిబ్రవరి 27న వారి వివాహం జరిగింది. అలాగే ఆమె కూడా చెక్కు చెదరని ఆయన ఆరోగ్యం, కఠోరంగా శ్రమించే లక్షణం వీటితో ఆకర్షింపబడ్డానని' చెప్పింది. అప్పటికి ఇద్దరం 30 లలో వున్నాము. ఒకరినొకరం బాగా అర్థం చేసుకున్నాము. వారి పెళ్ళి చాలా సాదాగా జరిగిపోయింది. ఒక విలక్షణ పద్ధతిలో పార్టీ ప్రధాన కార్యదర్శి పి.సి.జోషి వద్దకు వెళ్ళి వారిద్దరూ భార్యాభర్తలుగా ప్రకటించుకున్నారు. కమ్యూన్‌లో మిగతా వాళ్ళందరినీ పిలిచి చిన్న టీ పార్టీ ఇచ్చి వారి కొత్త హోదా తెలియజేశారు. మహిళా కోణం నుంచి పెళ్లిని రిజిస్టర్ చేసుకుందామని పిఎస్ ప్రతిపాదించాడు. కాని రాజకీయ ఘటనలు వేగంగా తోసుకురావడంతో వారికి ఆ సమయం చిక్కలేదు.

తర్వాత ఏడాది సుందరయ్య సంతానం కలగకుండా వేసెక్టమీ ఆపరేషన్ చేయించుకున్నాడు.దానికి ముందు ఆయన పిల్లలు వుండాలా వద్దా అనే దానిపై లైలాతో చర్చించాడు. ఇక సంతానం వద్దని నిర్ణయించుకున్నారు. అలాటి నిర్ణయం దంపతులు కలిసి తీసుకోవాలన్నది పిఎస్ అభిప్రాయం. ఈ మాట ఆయన తర్వాత కాలంలో కామ్రేడ్స్‌కు చాలా సార్లు చెబుతుండేవాడు. ఒక కుటుంబం ఎంత ప్రగతిశీలమైందైనా పిల్లల విషయంలో శారీరకంగానూ, ఇతరత్రానూ భారం మోసేది స్త్రీలే గనక ఆ నిర్ణయంలో వారి మాటకు విలువుండాలనేది ఆయన అభిప్రాయం. వారి వివాహ సమయంలో పార్టీ అటూ బ్రిటిష్ సామ్రాజ్యవాదనికీ, ఇటు నిజాం నిరంకుశత్వానికీ స్వాతంత్రోద్యమంలోని కమ్యూనిస్టు విద్వేష శక్తులకు వ్యతిరేకంగా అనేక రంగాల్లో పోరాటంలో తలమునకలై వుంది. రేపటి పరిస్థితి ఎలా వుంటుందనేది చెప్పడానికి లేని సందర్భం. కనక పిల్లలు వుంటే చిక్కు అవుతుందని, వారు కలసి నిర్ణయించుకున్నారు. ఒక దశలో లైలా ఒక బిడ్డ వుండాలన్న కాంక్ష వెలిబుచ్చినప్పటికీ తర్వాత ఆలోచన మార్చుకుంది. అదొక నిస్వార్థ నిర్ణయం.


లైలా చాలా నిబద్ధత గల కమ్యూనిస్టు. 1948-1952 మధ్య పార్టీ దారుణ నిర్బంధానికి గురైన సమయంలో ఎంతో సాహసంతో పార్టీ రహస్య కేంద్రాలను ఏర్పాటు చేయడంలో నిర్వహించడంలో సహకరించింది. ఆయనను గుర్తుపట్టే అవకాశం వున్న చోట్ల లైలా బయటకు వెళ్లి కామ్రేడ్స్‌తో కలసివస్తుండేది. 1952లో సుందరయ్యకు పార్టీ కేంద్ర యంత్రాంగ బాధ్యతలు అప్పగించినప్పుడు 1952 నుంచి 1954 మూడేళ్లపాటు

అక్కడున్నారు. ఆ సమయంలో లైలా పార్లమెంటరీ పార్టీ ఇన్‌ఛార్జిగా పనిచేసింది. 1960లలో సిపిఎం ఏర్పడిన తర్వాత లైలా కలకత్తాలో పార్టీ కేంద్రంలో హోల్‌టైమర్‌గా పనిచేసింది. పార్టీ ప్రచురణల మేనేజిమెంటు కార్యాలయం నిర్వహణ చూసింది. భాషలు నేర్చుకోవడంలో ఆమెకు గొప్ప శక్తి వున్నందున కొద్దికాలంలోనే బెంగాలీ నేర్చుకుంది. పార్టీ మహిళా పత్రికల్లో ఎప్పుడూ రాస్తుండేవారు.

పిఎస్, లైలాలు అత్యంత సంతోషదాయకమైన దంపతులుగా జీవించారు. వారు సెలవుపై వెళ్లిన అరుదైన సందర్భాలలో పిఎస్ చాలా ఉల్లాసంగా కనిపిస్తుండేవాడు. ఆయన తన ఆత్మకథలో రాసినట్టుగా కొన్ని దశాబ్దాల వారి దాంపత్య జీవితంలో వారికి చిన్న తగాదా కూడా రాలేదు. యువ కామ్రేడ్లకు విప్లవానికి అంకితమైన వారికి ఆదర్శంగా నిలిచే జంట వారిది.

1934 నుండి ఆంధ్రలో పార్టీ నిర్మించబడ్డది. రెండవ ప్రపంచయుద్ధ కాలంలో అది అనేక రూపాల్లో ప్రజ్వరిల్లింది. అందుకు అనేక అగ్ని పరీక్షలను అది ఎదుర్కోవలసి వచ్చింది. ఒక వైపు బ్రిటిషు ప్రభుత్వ నిషేధాలు, నిర్బంధాలు గడిచి గట్టెక్కవలసి వచ్చింది. మరోవైపు కాంగ్రెస్ నాయకత్వం కక్షతో కత్తికట్టి కమ్యూనిస్టుల ఉద్యమంపై సాగించిన దాడినీ అది తట్టుకోవలసి వచ్చింది. ప్రపంచ ఫాసిస్టు వ్యతిరేక యుద్ధం యెడ కాంగ్రెస్ నాయకత్వం తప్పుడు వైఖరి తీసుకొని, క్విట్ ఇండియా పేరిట కొన్ని పొరపాటు కార్యక్రమాలకు పిలుపు నిచ్చింది. అది విఫలం కాగా అందుకు కారణం కమ్యూనిస్టులేనన్న దుష్ప్రచారాన్ని కొనసాగించింది. ప్రజలను రెచ్చగొట్టింది కనుక కమ్యూనిస్టుల హానికిని తామే కాపాడుకోవలసి వచ్చింది. రాజకీయ ప్రచార హక్కునూ, సభలనూ, పార్టీ ఆఫీసులనూ రక్షించుకోవలసి వచ్చింది.

అదే సమయంలో రాయలసీమ కరువు, ఉత్తరాంధ్ర జిల్లాల కరువూ సంభవించాయి. లక్షల మందిని పీనుగుల్ని చేసిన బెంగాలు కరువూ ఆనాటిదే. అందుకు తోడు జీవితావసర వస్తువుల, ముఖ్యంగా ఆహార పదార్థాల కొరత జనాన్నందరినీ ఇబ్బందుల పాలు చేసింది. మండు టెండల్లో నిలబడి, దొంగ మార్కెట్‌ని ఎండగట్టి కంట్రోలు ధరలను అమలు జరిపించవలసి వచ్చింది. కరువుబత్తెం, బంజరు పంపకం, వ్యవసాయ పనిముట్లు సరసమైన ధరలకు లభించే కృషి మొదలైన వాటన్నింటినీ సాధించేందుకు ఉద్యమాలు నడపవలసి వచ్చింది.



**సేవా కార్యక్రమాల్లోనూ కమ్యూనిస్టు పార్టీ అగ్రభాగాన ఉండేది: 1943లో కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో బందరు కాలువ పూడికతీతను పర్యవేక్షిస్తున్న సుందరయ్య**

పార్టీ నాయకులు, కార్యకర్తలు వేలాదిగా తరలివచ్చి బందరు కాలవలో మైళ్ళకొలదీ మేటవేసిన పూడికను రోజుల తరబడి త్రవ్వి, తలకెత్తుకొని మోసి అవతల కట్టలుగా పోసిన దృశ్యం మరపురానిది. ఒక సంవత్సరం ఆ కాలవ నీరుపారక పొలాలు బెట్టతీశాయి. వేసవిలోనైనా సిల్టు తీయించమని అధికార్ల వద్దకు రాయబారం వెళితే తాము అంత మంది కూలీలను సమీకరించి సకాలంలో పని పూర్తి చేయలేమని వారు నిస్సహాయతను వెలిబుచ్చారు. "అయితే ఆ పని మేమే చేస్తాం" అని కామ్రేడ్ సుందరయ్య బాధ్యత తీసుకుని కమ్యూనిస్టులను, ప్రజాసంఘ కార్యకర్తలను, ప్రజారక్షణ దళం వలంటీర్లను ఆ కాలవలోకి మార్చ్ చేయించారు.

ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు సేవ చేయడం అనేది సుందరయ్యకు స్వతసిద్ధమైన లక్షణం. అలాటి చోట ఒక కమ్యూన్ (భోజన శిబిరం) ఏర్పాటు జరిగింది. తైదజావ, అన్నం, పులుసు, మజ్జిగ, ఆహారం, మంచినీళ్ళకు ముంతలు, భోజనానికి మూకుళ్ళు పాత్రలు. క్యూలో నిలబడి వాటిని పుచ్చుకొని, తిన్న తర్వాత ఎవరి మూకుళ్ళూ, ముంతలు వారుకడిగి ఒక చోట పేర్చడం నిత్యకృత్యం. ఈ వింత చూడ్డానికి వేలాది ప్రజలు వచ్చి విస్తుపోయేవారు. ఈ విధంగా సేవా కార్యక్రమాలు సమరశీల పోరాటాలు కలగలిపి సాగించడం కమ్యూనిస్టుల ప్రతిష్టను అపారంగా పెరగడానికి కారణమైంది.డెల్టా ప్రాంతాల నుండి కామ్రేడ్స్ అనేక మంది పార్టీ పిలుపందుకొని కరువు నివారణ కృషి కోసం అటు రాయలసీమ, ఇటు శ్రీకాకుళం, విశాఖపట్నం వైపు తరలి వెళ్ళారు. కొందరక్కడే స్థిరపడిపోయారు. తర్వాత తెలంగాణా వీరోచిత పోరాటంలో పాల్గొనడానికి వారకలు తీశారు. స్వాతంత్ర్య పిపాసులైన వందలాది మంది యువతీ యువకులను కమ్యూనిస్టు వాద్యమం వైపు ఆకర్షించి, వారిని సైనికులవలె కదంతొక్కించి వాద్యమాలను నిర్మించిన ప్రారంభ దినాలవి. ఆకర్షితులైనవారు విద్యార్థులూ యువకులూనూ. గాంధీజీ మార్గంతో అసంతృప్తి చెంది, సోషలిస్టు, కమ్యూనిస్టు భావాలతోనూ, విప్లవోత్సాహంతోనూ వాగ్రూతలూగి వాద్యమంలోకి వచ్చిన సైన్యమే అదంతా. ఆ విజృంభణకు ప్రతిబింబాలుగా, వాణిగా, మార్గదర్శకంగా నడిచాయి నవశక్తి, ప్రజాశక్తి పత్రికలు.

రాజకీయ చైతన్యం, త్యాగం, సేవానిరతి, సాహసం, సంసిద్ధత, క్రమశిక్షణ మొదలయినవన్నీ ఆనాడు కామ్రేడ్ సుందరయ్యలాంటి వాళ్ళు అనలు వేయగా అభివృద్ధి చెందాయి. అనేకమంది నాయకులు, కార్యకర్తలు, యువతీ యువకులు ఆయన ఆదర్శాన్ని అనుసరించి తమ ఆస్తులూ, నగలూ అమ్మి పార్టీ నిధికి సమర్పించారు.స్వంత ఆస్తిలేని కష్టజీవులైన అత్యధికులు కూడా కార్మికవర్గం నుంచి కమ్యూనిస్టుపార్టీ హోల్‌టైమర్లుగా వచ్చారు. “100 మంది పడక కుర్చీ రాజకీయవాదుల కంటే ఒక హోల్‌టైమ్ విప్లకారుడు పార్టీ నిర్మాణానికి ఎక్కువ అవసరం” అని లెనిన్ చెప్పిన సూక్తికి అనుగుణంగా ఆ విధంగా హోల్‌టైమర్లను తీసుకునే సంప్రదాయం ప్రారంభమైనది. రాష్ట్రంలో ప్రథమ హోల్‌టైమరుగా నండూరి ప్రసాదరావు 1936 ప్రారంభంలో తూర్పుగోదావరి జిల్లాలో పార్టీ నిర్మాణాన్ని సాగించేందుకు వెళ్లాడు. ఈ కార్యకలాపాలను సాగించడానికి ఇంటి వద్ద నుండి వచ్చే ధన సహాయమేమీ లేదు. కాబట్టి నెల 1కి 14 రూపాయల అలవెన్సును సుందరయ్యగారే నిర్ణయించి ప్రతినెలా పంపుతుండేవారు అప్పటికి అది సరిపోయేది.

హోల్‌టైమర్ల పూర్తికాలం పార్టీ కార్యక్రమానికే వినియోగించాలంటే వారి కుటుంబ పోషణకు సరిపడు అలవెన్సునివ్వాలి. వారి కుటుంబమెంత? అవసరాలు

ఏమిటి? వారి ఆదాయమేమిటి? మున్నగున్నవన్నీ పరిశీలించి ఒక క్రమపద్ధతిలో అలవెన్సులను నిర్ణయించడం పార్టీలో సుందరయ్యగారే ప్రవేశపెటాఎరు. పార్టీ కమిటీ చర్చలలో హోల్‌టైమర్ల సమస్య సదా చర్చించబడుతూ వుండేది. ప్రతి హోల్‌టైమరు యొక్క మొత్తం కుటుంబ పరిస్థితి అంతా సుందరయ్యగారికి కరతలామలకం. మినీ సైజులో వుండే వారి పాకెట్ నోట్‌బుక్‌లో ఇప్పటి పార్టీ హోల్‌టైమర్ల, హోల్‌టైమర్లుగా తీసుకోదలచుకున్న వారి మొత్తం భోగట్టా వుండేది.

ప్రజావైద్యశాలలన్నవి ఆంధ్రప్రదేశ్ ప్రత్యేకత. బెంగాల్ కరువు బాధితుల సేవ చేసి వచ్చిన డాక్టర్ రామచంద్రారెడ్డి (సుందరయ్యగారి తమ్ముడు) మొదట దాన్ని నెల్లూరులో నెలకొల్పారు. ఆయన చనిపోయినా పేదల ఆస్పత్రిగా అది మరింత అభివృద్ధి చెంది ప్రఖ్యాతిగాంచింది. దాని ఆదర్శంతో ఎాత్సాహపడిన అనేక మంది పార్టీ డాక్టర్లు పలు ప్రాంతాల్లో అటువంటి వైద్యశాలలను నడుపుతున్నారు. వైద్య వృత్తిలో ఈ సేవాతత్పరతను ప్రోత్సహించి తగు సలహా సంప్రదింపులతో రాణింపుకు తెచ్చిన మానవతావాది కామ్రేడ్ సుందరయ్య. తన జీవితం చివరి దశ వరకూ ఆయన ఈ వైద్యశాల నిర్వహణను వ్యక్తిగతంగా పర్యవేక్షించేవాడు.,

## యుద్ధానంతర ప్రజా వెల్లువ

ఫాసిజంపై సోషలిజం చారిత్రాత్మక విజయం సాధించి ఒక వ్యవస్థగా రూపొంది సామ్రాజ్యవాదాన్ని ప్రత్యక్షంగా సవాలు చేసే స్థితి రావడంతో భారత కమ్యూనిస్టు పార్టీ ముందు కొత్త కర్తవ్యం వచ్చిపడింది. యుద్ధానంతర ప్రజా వెల్లువకు నాయకత్వం వహించింది. ఆంధ్రలో జమీందారీ వ్యతిరేక పోరాటాలు ప్రజ్వరిల్లి ఉత్తరోత్తరా నిజాం ఏలుబడిలోని తెలంగాణా ప్రాంతానికి విస్తరించాయి. రాజకీయ ప్రచారంలో, ప్రజా సంఘాల నిర్మాణంలో, ప్రజా సమస్యల పట్ల కదిలి పనిచేయడంలో, విప్లవ సాహిత్యం, సంస్కృతీ, సంస్కరణ పెంపొందడంలో ఆంధ్రరంగ స్థలంలో అన్ని రంగాల్లోనూ నూతనోత్సాహం వెల్లివిరిసింది. వీరేశలింగం, గిడుగు, గురజాడ, చిలకమర్తి, మాడపాటి, సురవరం ప్రతాపరెడ్డి వంటి వారి సంస్కరణలు, రచనలు పునరుజ్జీవం పోసుకున్నాయి. బాల, విద్యార్థి, యువజన, మహిళా సంఘాలు, కార్మిక, వ్యవసాయ కార్మిక, నేత, గీత, రైతు సంఘాలు, ప్రజానాట్యమండలి, ప్రజారక్షణ దళాలు, అభ్యుదయ రచయితల సంఘం– ఒకటేమిటి ఆబాలగోపాలాన్ని ఆకర్షించే ఎాద్యమాలన్నీ అప్పుడు విజృంభించాయి. గ్రామ గ్రామాన సభలు– ఆటలు, పాటలు, వైజ్ఞానిక ప్రదర్శనలు, వీధిభాగవతాలు, బుర్రకథలు



**కమ్యూనిస్టు ఉద్యమంలో ఓ ఉజ్వల ఘట్టం కేరళలో కయ్యూర్ కామ్రేడ్స్ పోరాటం: ఉరిశిక్ష పడిన కయ్యూర్ కామ్రేడ్స్‌ను కలుసుకునేందుకు పిసిజోషి, కృష్ణపిళ్ళైలతో కలిసి వెళ్తున్న సుందరయ్య (చివరి కూర్చున్నవారు)**

మొదలుగా గల జానపద కళారూపాలన్నీ వినూత్న భావాలతో పూరించబడి ప్రదర్శనలుగా తయారైనాయి. "మా భూమి" నాటకం లాంటివి రంగస్థలి నలంకరించాయి. ూరికంబాలకెక్కిన కయ్యూరు కామ్రేడ్స్ ఊరూరా మ్రోగిపోయారు. బెంగాలు కరువు నృత్యం జనాన్ని కదిలించింది. వలంటీరు శిక్షణా కేంద్రాలు, రాజకీయ పాఠశాలలు నిత్యకృత్యాలైనాయి. వీటన్నింటికీ తారాస్థాయి  1944లో జరిగిన అఖిలభారత రైతు మహాసభ. ఈ సభలకు లక్ష మందికి పైగా హాజరైనారు. ఇదంతా ఆంధ్రలో కమ్యూనిస్టు పార్టీ విజృంభణకు అద్దం పట్టింది.

సుందరయ్య లక్ష్య సాధన విషయంలో సంతృప్తి అనేది ఎరుగని మనిషి. తను ఎక్కువగా సాధించిన కొద్ది వ్యక్తిగతంగానూ సంస్థాగతంగానూ కూడా మరిన్ని లక్ష్యాలు నిర్దేశించుకునేవాడు.పార్టీకి ఉజ్వల భవిష్యత్తును వూహించి ఆయన అందుకోసం అనేక నిర్దిష్టమైన స్వల్పకాలిక ప్రణాళికలు సిద్ధం చేశాడు. అయితే ఎప్పుడూ దీర్ఘకాలిక లక్ష్యాలే ఆయన దృష్టిలో వుండేవి. ఆయన నాయకత్వంలో పార్టీ పత్రిక ప్రజాశక్తి దృఢంగా వేళ్లూనుకుంది. ప్రజాశక్తి నగర్ స్థాపించేందుకోసం చాలా భూమిని సేకరించాడు.అది పత్రిక ముద్రణా కేంద్రంగానే గాక సిబ్బందికి పరిమితమైన గృహ వసతి కల్పించేందుకు కూడా కేంద్రమైంది. ప్రజాశక్తి నిర్వహణను పర్యవేక్షించేందుకోసం ఒక ట్రస్టు ఏర్పాటైంది. సుందరయ్య లీల అక్కడే ఆ ప్రెస్ కార్మికుల మధ్యనే వారికోసం ఏర్పాటైన ఇళ్లలోనే నివసిస్తూ ఆ ప్రాథమిక సదుపాయాలతోనే సర్దుకునేవారు.

ఆంధ్ర రాష్ట్ర కమ్యూనిస్టు కమిటి 1947 ఎన్నికలలో పోటీ చేయాలని నిర్ణయించింది. ఆ సమయంలో కొత్తరాష్ట్రం ప్రతిపాదన ముందుకొచ్చింది. నిజాం పాలనలోని తెలుగు జిల్లాలతో కూడా కలుపుకొని విశాలాంధ్ర ఏర్పాటు చేయాలన్న అంశం ప్రణాళికలో పొందుపర్చబడింది.కొత్త రాష్ట్రం పేరు సుందరయ్య నుంచి వచ్చిందని చెప్పడం అతిశయోక్తి కాదు. పేరును సూచించడంతోనే ఆయన ఆగలేదు.విశాలాంధ్రలో ప్రజారాజ్యం పేరిట ఒక చారిత్రాత్మక పుస్తకం రాశాడు. దాంట్లో కొత్త రాష్ట్ర ఏర్పాటుకు సంబంధించిన భౌగోళిక సరిహద్దులు, నదులు ఇతర ప్రకృతి వనరుల గురించిన ప్రణాళిక ఇచ్చాడు. దాని అభివృద్ధికి గల అవకాశాలు,సాధ్యాసాధ్యాలు పొందుపర్చాడు. సుందరయ్యలో గమనించదగిన ఒక మంచి లక్షణం ఏమంటే ఆయన ఏదైనా విషయంపై పూర్తి స్థాయిలో వ్యాసం లేదా పుస్తకం రాయాలనుకుంటే అందుకు సంబంధించిన వివరాలు, గణాంకాలు లోతుగా అధ్యయనం చేసి సేకరించి ఆ తర్వాతే రచన ప్రారంభించేవాడు. ఈ అంశంపై ఆయన అనుసరించిన సునిశిత అధ్యయన పద్ధతి, పరిశోధనలు ఈనాటికి రాష్ట్రంలో దిక్సూచిలా నిలిచి వున్నాయి.

## తెలంగాణా సాయుధ ప్రజా పోరాటం

1946-51 మధ్య కాలం ఆంధ్ర ప్రదేశ్ కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో మైలు రాళ్ల వంటివి. ఆ కాలంలోనే కామ్రేడ్ సుందరయ్య మాకినేని బసవపున్నయ్య, చండ్ర రాజేశ్వరరావు, రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, బి.నరసింహారెడ్డి, దేవుల పల్లి వెంకటేశ్వరరావు తదితరులతో కలసి భూస్వామ్య దొరలు వారి మూల విరాట్టుగా వున్న

నిజాం పాలనకు వ్యతిరేకంగా తెలంగాణా రైతాంగ ప్రతిఘటనను నడిపించారు. 1946లో ఒక రోజు కొండపల్లి అడవిలో గెరిల్లాలు భావి పోరాటానికి శిక్షణ పొందుతున్నప్పుడు అడవి పొదలలో దాగుకొని మాటు కాస్తున్న ఒకానొక సమయంలో ఆకస్మికంగా ప్రవేశించిన సుందరయ్యగారిని చూసి ఆశ్చర్యపోయారు.. ఇంతకూ ఆయన వెళ్లింది ఏదో రాజకీయ సందేశం ఇచ్చి పోవటానికి లేదా ఉపన్యాసం చేయడానికి కాదు. తను కూడా గెరిల్లా శిక్షణలో ప్రత్యక్షంగా పాల్గొనడానికే. ఆ రోజు ఆయన వారిలో ఒకడయ్యాడు. గెరిల్లా శిక్షణా తరగతులు, వాటి సాధకబాధకాలు చర్చించి వాటి పరిష్కారానికి సూచనలు చేసి ఉత్తేజకరమైన రాజకీయ సందేశం అందించి తెచ్చుకున్న సైకిలు పైన విజయవాడకు దాదాపు 30 కిలోమీటర్లు తిరుగు ప్రయాణం సాగించారు.

తెలంగాణా ఉద్యమంలో ఆ అయిదు సంవత్సరాలు నాయకత్వం వహించడానికి సుందరయ్య ఐచ్ఛికంగా తనకు తానే పార్టీలో ప్రతిపాదించి బాధ్యత తీసుకున్నారు. ఆయన, తన సహచరులు కేవలం పోరాటానికి మార్గదర్శకత్వం చేయడమే కాదు, గెరిల్లాలతో కలసి మెలసి వుంటూ వారి సుఖ దుఃఖాల్లో పాలు పంచుకున్నారు. ఆ రోజుల్లో తెలంగాణా ప్రజానీకం కేవలం నిజాం సేనలు, రజాకార్లు, దొరల గూండాలనే గాక భారత సైన్యాన్ని కూడా ఎదుర్కోవలసి వచ్చింది. ఆ సైనికులు తెలంగాణా రైతాంగంపై చెప్పనలవి గాని అమానుషాలు సాగించారు. సుందరయ్య గెరిల్లాలకు రాజకీయ పరిణామాలు మార్పులు గురించిన సమాచారం ఎప్పుడూ తెలియజేస్తుండేవారు. ముగింపులో ఇచ్చిన సందేశంతో ఉత్తేజపరచి, భవిష్యత్ పోరాటానికి వెలుగుబాట చూపారు. తెలంగాణా సాయుధ పోరాట దళాలు యూనియన్ సైన్యాల చక్రబంధంలో బిగించబడుతున్న నూతన పరిస్థితులో పోరాటాన్ని ఎలా కొనసాగించాలనేది ఆ రణరంగంలో వున్న గెరిల్లాలతో ముఖాముఖీ చర్చించి తెలుసుకోవడానికి వెళ్ళేవారు. ఇందుకు సంబంధించిన వివిధ వ్యూహాల మంచి చెడ్డలను సుదీర్ఘంగా చర్చించుతూ సాయుధ పోరాటాన్ని కొనసాగించడానికి, ఆత్మరక్షణ చేసుకోవడానికి ఎలాటి ఎత్తుగడలు అనుసరించాలనేది మాట్లాడేవాడు. నిక్కర్, హాఫ్‌షర్టు ధరించి తుపాకి చేబూని సాయుధుడై వున్న సుందరయ్య గెరిల్లాలతో అడుగులో అడుగు వేస్తూ ఆ కీకారణ్యంలో కఠోర శిక్షణ ఇచ్చాడు.

పిఎస్ యుద్ధ రంగంలో నిప్పులు కురిపించడమే నిత్యజీవితంలో కూడా కఠోర క్రమశిక్షణ పాటించేవాడు. అప్పటికి నలభై సంవత్సరాల వయస్సుకు చేరుతూన్న సుందరయ్యగారు ఉదయం నాలుగు గంటలకు లేచి కఠిన శరీర వ్యాయామం చేసేవారు.

ఐదు గంటలకల్లా కాలకృత్యాలు తీర్చుకొని కార్యరంగానికి సిద్ధమయ్యేవారు. కనిపిస్తే కాల్చిచంపే రోజులవి. ప్రాణానికి తెగించి జేబులో చిన్న ఆయుధాన్ని మల్చుకొని మారువేషంలో సైకిలుపై అతివేగంగా వెడుతూ క్రింది యూనిట్లకు కొరియర్సు ద్వారా ఆయన కార్యక్రమాలు అందజేసేవారు.

ఆ రోజుల్లో దళానికి రక్షణగా రాత్రులూ, పగలూ కాపలా ఉండడానికి వంతులవారీగా సమయం కేటాయించబడేది. రాత్రివేళల్లో మాత్రం ప్రతి గంటకు ఒకరు చొప్పున దళంలోని జన సంఖ్యను బట్టి కాపలా సమయం నిర్ణయించబడేది. ఒక రోజు రాత్రి ప్రతి గంటకు కాపలా మారాలని.నిర్ణయించుకున్నారు. ఆ సమయంలో గెరిల్లాలు యథావిధిగా రాత్రి కాపలా కొనసాగిస్తున్న సమయాన కామ్రేడ్ సుందరయ్యగారు స్వయంగా ప్రతి గంటకు ఒకసారి నిద్ర నుండి లేచి కాపలాను మార్చేవారు. వారు దినమంతా విశ్రాంతి లేకుండా చర్చలు, సమావేశాలు, చదవడం, వ్రాయడం ఏ మాత్రం తీరిక లేకుండా కార్యక్రమాల్లో పాల్గొంటూనే రాత్రులందు ఖచ్చితంగా ప్రతి గంటకు నిద్ర నుండి లేచి కాపలా మార్చడంలో ఏ మాత్రం అలుపెరుగని ఆయన కార్యదీక్ష మమ్ములను గెరిల్లాలను ఎంతగానో ఉత్తేజపరచేది. మళ్లీ తెల్లవారుతుండగానే ఆయన నిద్ర నుండి మేల్కొని, వ్యాయామం కూడా ముగించుకొని రేడియో వింటున్నారు. రాత్రంతా కాపలాలు మార్చడానికి ప్రతి గంటకు నిద్ర లేవడంతో పాటు అందరికన్నా ముందుగానే మేల్కొనడం, అవిశ్రాంత కార్యసరళి వారిలో ఓ క్రొత్త అనుభూతిని కలిగించింది.

ఆయన అటు రేడియోలో వార్తలు వింటూనే ఇటు పత్రిక కూడా చదివేవారు. ఓ కామ్రేడ్ సుందరయ్యగారిని “ఏమండీ మీరు ఇందాకా పేపరు చదివారా? లేక రేడియోలో వార్తలు విన్నారా?” అని అడిగాడు. సుందరయ్యగారు చిరునవ్వుతో రేడియోలో వచ్చిన వార్తల గూర్చి, పత్రికలలో చదివిన వ్యాసాల గూర్చి చెపుతూ, తనని అడగాలనుకున్న ప్రశ్న గురించి ఆ కామ్రేడ్స్ పరస్పరం చెవులు కొరుక్కోవడం గురించి కూడా చెప్పారు. అలా ఆ కామ్రేడ్ చెప్పేసరికి ఆ విషయం మమ్ములనందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తిందని గెరిల్లా నాయకులు రాశారు.

తర్వాత కాలంలో ఆ పోరాటాన్ని ఇంకెంత మాత్రం కొనసాగించలేని పరిస్థితి ఏర్పడింది.వందలాది మంది కామ్రేడ్స్ ప్రాణాలకు ముప్పు పొంచి వున్న స్థితి అది. అతి తక్కువ నష్టంతో ఎలా బయిటపడాలన్నదే సమస్య. గెరిల్లా దళాలను సంప్రదించకుండా, వారి ఆమోదం లేకుండా ఎలాటి అడుగు వేయడానికి లేదు. అదొక తీవ్ర సైద్ధాంతిక పోరాటానికి దారి తీసింది. ఎలాటి వ్యూహం అనుసరించాలనేదానిపై కామ్రేడ్స్‌ను ఒప్పించడానికి పిఎస్ మొత్తం రెండు రాత్రులు పగళ్ళు వాదించవలసి వచ్చింది. పోరాట

కాలంలో వారికి ఆయనపై కలిగిన అపార విశ్వాసమే 1951లో తెలంగాణా పోరాట గాపసంహరణకు తుది నిర్ణయం తీసుకోవడానికి ముఖ్యంగా ఉపయోగపడింది.

## పార్లమెంటులో, శాసనసభలో ప్రతిపక్ష నేతగా..

తర్వాత కమ్యూనిస్టు పార్టీ ముందు పార్లమెంటరీ పోరాట దశ వచ్చింది. తెలంగాణా పోరాట విజయాలను గట్టి పర్చుకోవడానికి పార్లమెంటరీ వేదికను వుపయోగించుకోవాలని నిర్ణయమైంది. స్వతంత్ర భారత దేశపు మొదటి సాధారణ ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ ఆంధ్రనుంచి 18 పార్లమెంటు స్థానాలు గెల్చుకుని ప్రధాన ప్రతిపక్షంగా అవతరించింది. సుందరయ్య రాజ్యసభలో నాయకుడైనాడు. ఇక్కడ సుందరయ్య మరోసారి తన నిర్మాణ కౌశలం చూపించగలిగాడు. లోక్‌సభలో నాయకుడైన ఎ.కె.గోపాలన్‌తో చక్కటి సమన్వయం చేసుకోగలిగాడు. కమ్యూనిస్టు పార్లమెంటు సభ్యులు పద్ధతి ప్రకారం పనిచేయడానికి పిఎస్ పునాదులు వేశాడు. లోతైన అధ్యయనం వర్గ దృక్పథం మేళవించగలిగాడు. పార్లమెంటులో అధ్యయనాత్మకమైన తన ప్రసంగాలు, హుందాతనంతో కూడిన ప్రవర్తన ద్వారా ఆయన వ్యక్తిగతంగా మంచి దోహదం అందించాడు. వివిధ సమస్యలు అధ్యయనం చేసేందుకోసం ఆయన వివిధ శాఖల అధికారులు, మేధావుల సహకారం తీసుకునేవాడు. సభలో ఆయా అంశాలపై చర్చలు వాదోపవాదాల్లో పాల్గొనేప్పుడు తగు సన్నాహంతో వెళ్ళే విధంగా జాగ్రత్తలు తీసుకునేవాడు. అధికార పక్ష సభ్యులు కూడా చాలా శ్రద్ధగా వినేవారు. ఆ ప్రసంగాలలోని వివరాలు గమనించాలని అధికారులకు ప్రత్యేకంగా ఆదేశాలుండేవి. దేశ స్వాతంత్రానంతరం అదే తొలి పార్లమెంటు గనక జాతీయ విధానాలకు సంబంధించిన అనేక ముఖ్యాంశాలను ఆమోదించవలసి వచ్చేది. అలాటి సభలో సుందరయ్య వుండటం చాలా ప్రభావం చూపించింది.న్యాయపరమైన సాంకేతికమైన కోణాల నుంచి విలువైన సూచనలు చేయడం ద్వారా ఆయన చర్చలను సుసంపన్నం చేసేవాడు. ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూతో ఆయన ఘర్షణ పడిన సందర్భాలున్నాయి. సభాధ్యక్షులుగా వున్న డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ జోక్యం చేసుకుని ఆ ఇద్దరు ఉద్దండులను శాంతపర్చాల్సి వచ్చేది. మొత్తంపైన చూస్తే సుహృద్భావ పూర్వక సంబంధాలే వుండేవి.

సుందరయ్య ఇతర కమ్యూనిస్టు ఎంపిలు భాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం పార్లమెంటులో నిరంతరం పట్టుదలగా పోరాడారు.ఈ విషయంలో విశాలాంధ్ర ఎజెండాలో

మొదట వుండేది.స్వయంగా తెలుగు వాడైన డా.రాధాకృష్ణన్ సుందరయ్య రాసిన విశాలాంధ్రలో ప్రజారాజ్యం పుస్తకాన్ని ఎంతగానో ప్రశంసిస్తూ ఇతరులకు కూడా దాన్ని మార్గదర్శకంగా చూపించేవాడు. 1955లో పార్లమెంటుకు రాజీనామా చేసేవరకూ సుందరయ్య ఈ బాధ్యతలు చాలా సమర్థంగా, దీక్షాయుతంగా నెరవేర్చారు.పార్లమెంటుకు ఆయన సైకిల్‌పై వెళ్లిన ఉదంతం భారత రాజకీయాలలోనే సుప్రసిద్ధ కథగా మారింది. దాన్ని ఒక ఆదర్శంగా ఎప్పుడూ ఉటంకిస్తుంటారు.

1952 శాసనసభ ఎన్నికల్లో మద్రాసు, హైదరాబాదు రాష్ట్రాల్లోని తెలుగు జిల్లాల్లో కమ్యూనిస్టు పార్టీ అఖండమైన విజయాలు సాధించింది. అయితే ఆ రాష్ట్రాల పొందిక కారణంగానూ కేంద్ర ప్రభుత్వ కుట్రల వల్లనూ మంత్రివర్గాలు ఏర్పాటు చేయలేకపోయింది.అయినా కమ్యూనిస్టులు ప్రముఖ శక్తిగానే నిలబడ్డారు. ఎన్నికల తర్వాత మద్రాసు ప్రెసిడెన్సీ నుంచి ఆంధ్ర రాష్ట్రాన్ని విడదీయడంతో కర్నూలులో ప్రత్యేక శాసనసభ ఏర్పడింది. తర్వాత కొద్ది కాలానికే అది అవిశ్వాస తీర్మానంతో ఓడిపోయి 1955 మధ్యంతర ఎన్నికలు వచ్చాయి. కమ్యూనిస్టులు విజయం సాధిస్తారని సుందరయ్య ముఖ్యమంత్రి అవుతారని అందరూ అనుకున్నారు.అయితే ఆ ఎన్నికల పోరాటంలో కమ్యూనిస్టు పార్టీపై పెద్ద దాడి సాగింది. దానికి వ్యతిరేకంగా అన్ని బూర్జువా పెటీ బూర్జువా పార్టీలు కాంగ్రెస్ జెండా కింద గుమికూడాయి. ఆ ఎన్నికల పోరాటంలో కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన ప్రజా వెల్లువ ఒకవైపు ఏడేళ్లుగా పాలిస్తున్న కాంగ్రెస్ మరో వైపు సాగించిన ఘర్షణను నాటి ప్రత్యక్ష సాక్షులు ఇప్పటికీ మర్చిపోలేరు.ఆంధ్రలో కమ్యూనిస్టులపైన ఎన్నడూ జరగనంత విషపుదాడి సాగిన కాలమది.

సీట్ల రీత్యా కమ్యూనిస్టు పార్టీకి తక్కువగానే వచ్చినప్పటికీ ఓట్ల శాతం నిష్పత్తి బ్రహ్మాండంగా వున్నాయి. అయిదు కోట్ల మంది ప్రజలున్న రాష్ట్రంలో దాదాపు 34 శాతం మంది దానికి ఓటేశారు. దాదాపు వంద నియోజక వర్గాలలో పార్టీకి 47 శాతం ఓట్లు వచ్చాయి. 1955 నుంచి 1967 వరకూ శాసనసభలో కమ్యూనిస్టు పార్టీ నాయకుడుగా పిఎస్ పనిచేశారు. సభా కార్యక్రమాల్లో సుందరయ్య పాత్ర, అలాగే ఆనాటి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డితో ఆయన వాడీ వేడీ వివాదాలు ఇప్పటికీ జ్ఞాపకం వుండిపోయాయి. ఏ అంశంపైనైనా తగు అధ్యయనం సన్నాహం లేకుండా పిఎస్ మాట్లాడేవాడు కాదు. నిజానికి ఆ శాఖ మంత్రికన్నా ఎక్కువ వివరాలిచ్చేవాడు.ఆ రోజులను గురించి పిఎస్ ఇలా గుర్తు చేసుకున్నాడు: 1955 తర్వాత ఆంధ్ర శాసనసభలో చర్చలకు మేము ఎంతగానో దోహదం చేశాము. ప్రతి అంశంపైన మేము ఎంత క్షుణ్ణంగా వుండేవాళ్లమంటే ప్రభుత్వం ఎప్పుడూ ఆత్మరక్షణ స్థితిలోనే వుండేది. వివిధ అంశాలపై

పాలకపక్షానికి మనం నిర్మాణాత్మక సూచనలు చేసేవాళ్లం. ..అసెంబ్లీ కార్యదర్శి ఎ.వి.చౌదరి అంటుండేవారు, ఏ అంశంపై నైనా రాత్రింబవళ్లు చదివి క్షుణ్ణంగా, లోతుగా, అధ్యయనం చేసేది పి. సుందరయ్య. కనక ఆయనకు లైబ్రరీ రికార్డులు, డాక్యుమెంట్లు, ఫైళ్లు అడిగినవన్నీ ఇవ్వండి.' అని.ఈ కారణం వల్లనే శాసనసభలో కమ్యూనిస్టులు సంఖ్య రీత్యా 15 మంది మాత్రమే వున్నా పాలకపక్షం ముందు ఎప్పుడూ తలవంచే వారు కాదు. సమస్యలను సరైన కోణంలో ముందుకు తేవడంలో అగ్రభాగాన వుండేవారు.

## రివిజనిజంపై పోరాటం

కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కార్యాలయాన్ని ఏర్పాటు చేయడంలో సుందరయ్య చూపిన చొరవ ప్రత్యేకంగా చెప్పుకోదగింది.అలాగే పార్టీలో తలెత్తిన రివిజనిజంపై పోరాటంలోనూ ఆయన ముందున్నారు.1953లో మదురైలో జరిగిన పార్టీ మూడవ మహాసభలో ఆయన పొలిట్‌బ్యూరోకు ఎన్నికైనారు. తర్వాత 1956లో పాల్ఘాట్‌లో జరిగిన మహాసభలో కాంగ్రెస్‌తో కలసి జాతీయ సంఘటన ఏర్పాటు చేయాలని పిసిజోషి, రాజేశ్వరరావు తదితరులు తీర్మానం ప్రతిపాదించినప్పుడు సుందరయ్య, బసవపున్నయ్య, హరికిషన్ సింగ్ సూర్జిత్ తదితరులు వ్యతిరేకించారు. ఆ పంథా ఓటమిపాలైనప్పటికీ దానికి ప్రతినిధులలో మూడో వంతు మంది మద్దతు లభించింది. ఆ తర్వాత పార్టీ అంతరంగిక పోరాటం తీవ్రతరమైంది. నాల్గవ మహాసభలోనూ సుందరయ్య కేంద్ర కమిటీకి పొలిట్‌బ్యూరోకు తిరిగి ఎన్నికయ్యాడు.

1957లో జరిగిన కేంద్ర కమిటీ సమావేశంలో సుందరయ్య, బసవపున్నయ్య, హరికిషన్ సింగ్ సూర్జిత్ మోటూరు హనుమంతరావు, నండూరి ప్రసాదరావు తదితరులు రివిజనిస్టు ధోరణులను సవాలు చేస్తూ ఒక ప్రత్యామ్నాయ పత్రాన్ని ప్రతిపాదించారు.దానిపై పార్టీలో ఎనిమిది నెలల పాటు చర్చ జరిగింది. పార్టీ నిర్మాణ వ్యవస్థలలో మార్పులను ఖరారు చేసేందుకై 1958లో అమృతసర్‌లో పార్టీ ప్రత్యేక మహాసభ జరిగింది. పిఎస్. లెనినిస్టు నిర్మాణ సూత్రాలను నీరుగార్చడాన్ని గట్టిగా వ్యతిరేకించేవాడు.అయినా తన తమ్ముడు డా.రామ్ చికిత్స నిమిత్తం మాస్కోకు తోడుగా వెళ్ళినందున ఆ ప్రత్యేక మహా సభలకు హాజరు కాలేకపోయాడు. 1961లో పార్టీ ఆరవ మహాసభ నాటికి పార్టీ కార్యక్రమానికి సంబంధించి రెండు రకాల పంథాలు ఘనీభవించాయి. పార్టీలో చీలికను నివారించేందుకై ఒక రాజీ పథకం ప్రతిపాదించబడింది. కార్యక్రమాన్ని పక్కన పెట్టాలని నిర్ణయమైంది. భారతదేశ రాజ్యాంగ యంత్రాన్ని రివిజనిస్టు పద్ధతిలో నిర్వచించడానికి కొనసాగింపుగా రూపొందిన వర్గ సంకర వ్యూహాన్ని పిఎస్ దృఢంగా వ్యతిరేకించాడు.

ఈ దశలోనే కొందరు కామ్రేడ్స్ సుందరయ్యకు వ్యతిరేకంగా కేంద్ర కమిటీకి ఫిర్యాదు చేశారు.రివిజనిజంపై పోరాటంలో సుందరయ్యకు తోడుగా నిలిచిన సహచరుడు నండూరి ప్రసాదరావు ఇలా గుర్తు చేసుకున్నారు:

"ఇది పార్టీలోని రివిజనిస్టు నాయకత్వానికి ముఖ్యంగా డాంగేకు ఆగ్రహ కారణమైంది. సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటీలో డాంగే ఈ సమస్యను లేవనెత్తాడు. "కృశ్చేవ్‌ను రివిజనిస్టు అని ప్రచారం చేస్తున్నారట, దమ్ములుంటే బహిరంగంగా చెప్పమనండి" అని సవాళ్ళు విసిరాడు. సెంట్రల్ ఎగ్జిక్యూటివ్‌లో కృశ్చేవ్ లైను రివిజనిస్టు లైను అని భావించే వాళ్ళం చాలామందిమి వున్నాము. అయినా ఊరుకొన్నాము. కాని సుందరయ్యగారు మాత్రం లేచి "అది రివిజనిస్టు లైను అని నేను భావిస్తున్నాను" అని నిష్కర్షగా చెప్పారు.

ఆ విధంగా సాహసంగా, నిర్భయంగా తన భావాలను వెల్లడించగల వ్యక్తి కామ్రేడ్ సుందరయ్య."

1962లో భారత చైనా సరిహద్దు ఘర్షణ ప్రజ్వరిల్లినప్పుడు పిఎస్, ఇతర 'అతివాద' కమ్యూనిస్టులు అరెస్టు చేయబడ్డారు. అప్పటినుంచి పార్టీలో ఏర్పడిన కోర్ బృందంగా ఏర్పడి అధికారిక నాయకత్వానికి వ్యతిరేకంగా శ్రేణులను కూడగట్టిన వారిలో పిఎస్ భాగంగా వున్నాడు. సోవియట్ కమ్యూనిస్టుపార్టీ (సిపిఎస్‌యు) కృశ్చేవ్ నాయకత్వంలో చేపట్టిన సైద్ధాంతిక వైఖరులను ఆయన గట్టిగా వ్యతిరేకించారు. 1964లో 32 మంది సభ్యులు పార్టీ జాతీయ సమితి నుంచి బయిటకు నడిచారు.

## సిపిఎం ఏర్పాటు: ఆర్గనైజర్‌గా సుందరయ్య

తెనాలిలో ఒక సదస్సు జరిగింది. దాని తర్వాత 1964 అక్టోబర్-నవంబర్‌లో కోల్‌కత్తాలో పార్టీ ఏడవ మహాసభ జరిగింది.నూతనంగా ఆవిర్భవించిన భారత కమ్యూనిస్టుపార్టీ (మార్క్సిస్టు) కార్యక్రమాన్ని ఆ మహాసభ ఆమోదించింది.పిఎస్ ప్రధాన కార్యదర్శిగా తొమ్మిది మందితో పొలిట్‌బ్యూరో ఏర్పడింది.

ఆ మహాసభ ముగిసిన వెనువెంటనే కేంద్ర ప్రభుత్వం పార్టీని అణచివేసేందుకు చర్యలు ప్రారంభించింది. కేంద్ర కమిటీ సమావేశానికై త్రిచూర్‌కు చేరుకున్న సిపిఎం నాయకులు ముఖ్య కార్యకర్తలు అరెస్టు చేయబడ్డారు. అతివాద కమ్యూనిస్టులు చైనా

సహాయంతో భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాయుధ పోరాటం సాగించేందుకు కుట్ర పన్నుతున్నారని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరోపించింది. ఈ ఆరోపణలను ఏకరువు పెడుతూ హోం మంత్రి గుల్జారీలాల్ నందా ఒక శ్వేతపత్రం విడుదల చేశాడు. జైలులో వున్న పిఎస్ ఇతర పొలిట్‌బ్యూరో సభ్యులు దీనిపై గట్టి ఖండన జారీ చేశారు.

ఈ విధంగా మొత్తం కేరళ పార్టీ నాయకత్వం, పిఎస్ ఇతర పొలిట్‌బ్యూరో సభ్యులు జైలులో వున్న తరుణంలో కేరళ అసెంబ్లీ మధ్యంతర ఎన్నికలు వచ్చిపడ్డాయి. సిపిఎం మొదటి సారి ఈ ఎన్నికల్లో పాల్గొన్నది. అభ్యర్థులలో కూడా అనేకమంది జైళ్లలో వున్నారు. అయినా 35 సీట్లు గెలుచుకుని శాసనసభలో అతి పెద్ద పార్టీగా అవతరించింది. నిరాటంకంగా ప్రచారం చేసుకున్న సిపిఐ మూడు స్థానాలే తెచ్చుకోగలిగింది. సిపిఎం ప్రజా పునాది విస్తృతిని ఈ ఎన్నికలు నిరూపించాయి.

1966లో జైలు నుంచి విడుదల కాగానే పిఎస్ మరోసారి పార్టీ నిర్మాణ కర్తవ్యంలో నిమగ్నమైనాడు. రివిజనిజంతో సైద్ధాంతికంగానూ రాజకీయంగానూ తెగతెంపులు చేసుకోవలసిన అవసరం ఒకవైపున వున్నా మరో వైపున ఆ వారసత్వాన్ని వదిలించుకుని సరైన నిర్మాణ సూత్రాలపై పార్టీని పునర్నిర్మించుకోవలసిన అవసరం వుందని ఆయన భావించాడు. 1967లో కేంద్ర కమిటీ 'పార్టీ నిర్మాణంలో కర్తవ్యాలు' అన్న పత్రాన్ని ఆమోదించింది. పార్టీని మార్క్సిస్టు లెనినిస్టు సూత్రాల ప్రాతిపదికన పునర్నిర్మించుకోవడంలో అది కీలక పాత్ర వహించింది. పార్టీ ప్రధాన కార్యదర్శిగా పిఎస్ అన్ని రాష్ట్రాలూ పర్యటించి కేంద్రీకృత ప్రజాస్వామ్య సూత్రాలపై పార్టీని నిర్మించుకోవడానికి సహాయపడ్డాడు. ఈ సందర్భంలో కూడా కార్యకర్తలను గుర్తించడం, వారికి బాధ్యతలు అప్పగించడం, అభివృద్ధి చేసి అవగాహన పెంచడం వంటి విషయాల్లో ఆయన శక్తిసామర్థ్యాలు చాలా ముఖ్య పాత్ర వహించాయి. చాలా ప్రాథమిక స్థాయి నుంచి పార్టీని నిర్మించడంలో గాని, వున్న నిర్మాణాన్ని పటిష్టపర్చుకోవడంలో గాని ఆయన చాలా కృషి చేశాడు.

## పార్టీ కార్యకర్తల అభివృద్ధిలో పాత్ర

పిఎస్‌లో ఒక అసాధారణ లక్షణం పార్టీ కార్యకర్తలను తీర్చిదిద్దడంలో ఆయన పాత్ర. నేడు పార్టీలో వివిధ స్థాయిల్లో పనిచేస్తున్న వారికి ఇది ఒక పాఠంగా ఉపయోగపడగలదు. తీరిక లేని తన కార్యకలాపాల మధ్యనే ఆయన పార్టీ కార్యకర్తల

కోసం సమయం కేటాయించేవాడు. ఆయన అందరికీ సులభంగా అందుబాటులో వుండేవాడు. కార్యకర్తల నేపథ్యానికి సంబంధించిన చిన్న చిన్న వివరాల పట్ల కూడా చాలా శ్రద్ధ చూపించేవాడు. కార్యకర్తల బలాలు బలహీనతలను దృష్టిలో పెట్టుకుని బాధ్యతలు అప్పగించి ఆ పైన పని ఎలా జరుగుతున్నది పర్యవేక్షించేవాడు. ఎవరైనా పార్టీ కార్యకర్తకు ఏదైనా పని అప్పగించితే దాన్నించి ఎలాటి ఫలితం వచ్చేది ఆ కార్యకర్తకు చెప్పేవాడు. ఆయన క్రమశిక్షణకు చాలా ప్రాధాన్యత నిచ్చేవాడు. అదే సమయంలో ఎలాటి సోమరితనాన్ని సహించేవాడు కాదు. ఆలస్యంగా లేవటం, అధ్యయనానికి ప్రణాళిక లేకపోవడం వంటివి సహించేవాడు కాదు. వంధిమాగధతత్వం ఆయనకు ఎంత మాత్రం నచ్చేది కాదు. తనను స్వాగతిస్తూ సుదీర్ఘ ప్రసంగాలు చేయడం ఆయనకు ఎంతమాత్రం నచ్చేది కాదు. ఇతరులు పొగడ్తలు కురిపిస్తుంటే ఆలకించడం, తమను తాము పొగుడుకోవడం రెండూ బూర్జువా రాజకీయ లక్షణాలనీ, కమ్యూనిస్టుపార్టీలో వాటికి స్థానం వుండకూడదని చెప్పేవాడు. ఎవరైనా కార్యకర్త పొరబాటు చేస్తే ఆయన చాలా కఠినంగా నిశితంగా విమర్శించేవాడు. అదే సమయంలో ఆ కామ్రేడ్ తన తప్పును ఒప్పుకునేట్టయితే సరిదిద్దుకునేలా సహకరించడంలో తనే ముందుండేవాడు.

విద్యార్థి ోద్యమాన్ని విద్యార్థి కార్యకర్తలను పెంపొందించడంపై పిఎస్ ప్రత్యేక శ్రద్ధ పెట్టేవాడు. విశాల ప్రజాస్వామిక ఉద్యమం పెంపొందాలంటే విద్యార్థి ఉద్యమం చాలా కీలకమని ఆయన భావించేవాడు. ఆ సమయంలో విదార్థి నాయకులుగా వున్న కార్యకర్తలతో గంటల తరబడి మాట్లాడుతుండేవాడు. రాజకీయ సైద్ధాంతిక కృషి ఎంత ముఖ్యమో వారికి ఓపిగ్గా వివరించేవాడు. అలాటి వారిలో చాలా మంది పార్టీ నాయకులుగా అభివృద్ధి చెందారు.


సుందరయ్యలో వున్న మరో గొప్ప సుగుణం ఏమిటంటే ఆయన పార్టీ కార్యకర్తలను ఎంతగానో ప్రేమించేవాడు. సన్నిహితంగా మెలిగేవాడు. ఆంధ్రప్రదేశ్‌లో వేలాది మంది పార్టీ కార్యకర్తల పేర్లను ఆయన జ్ఞాపకం పెట్టుకునేవాడు. వారి క్షేమ సమాచారాల గురించి కుటుంబాల గురించి వ్యక్తిగతంగా అడిగితెలుసుకునేవాడు. నిజంగా అవసరమైనప్పుడు వారికి సాధ్యమైనంత సహాయం అందించేవాడు. ఈ విధమైన వ్యక్తిగత శ్రద్ధాసక్తులు పార్టీ కార్యకర్తలను ఎంతగానో ఉత్తేజపర్చి ఆయనవైపు ఆకర్షితులయ్యేవారు. అదే సమయంలో పిఎస్ క్రమశిక్షణా రాహిత్యాన్ని పార్టీ వ్యతిరేక ధోరణులను ఏనాడూ సహించలేదు.

## నిర్దిష్టత నుంచి సాధారణసూత్రీకరణల వైపు

పిఎస్ పని విధానంలో అత్యంత ప్రధానమైన ఒక భాగం ఏమంటే ఆయన వివరాల సేకరణకు చాలా శ్రద్ధ పెట్టేవాడు. నిర్దిష్ట వాస్తవాలు సంఖ్యా వివరాల ఆధారంగా విశ్లేషణ చేసేవాడు. సాధారణ సూత్రీకరణలంటే ఆయనకు ఇష్టం వుండేది కాదు. సమావేశాల్లో కామ్రేడ్స్ తాడూ బొంగరం లేని సాధారణీకరణలు గుప్పిస్తుంటే ఆయన తరచూ అసహనానికి గురయ్యేవాడు. భారతదేశంలో వ్యవసాయ సమస్య గురించి ఆయన లోతైన అధ్యయనం మహాగొప్ప మేధావులకు కూడా ఒక ఉదాహరణగా నిలుస్తుంది. ఆ రోజుల్లో కిసాన్‌సభ కేంద్రంలో పనిచేసిన కామ్రేడ్స్ అన్ని రాష్ట్రాలకు ఆయన పంపిన సవివరమైన ప్రశ్నావళి గుర్తు చేసుకుంటారు. గ్రామీణ ప్రాంతాల్లో మార్పులకు లోనవుతున్న వర్గ సంబంధాలను అర్థం చేసుకోవాలన్న తపన ఆయనలో తిరుగులేని విధంగా వుండేది. అలాగే రైతాంగంలో పెరుగుతున్న తేడాలు, భారతదేశ నిర్దిష్ట వాస్తవాలకు మార్క్సిజం అన్వయించడం అన్నవి ఆయన నిరంతర తపనగా వుండేది. జన బాహుళ్యాన్ని కదిలించే ప్రతిఘటనను నిర్మించే అంశాలను గుర్తించడంలో ఇవి అమూల్యమైన పాఠాలుగా వున్నాయి.

## అతివాద దుస్సాహసిక పంథాపై పోరాటం

పిఎస్ ఇతర నాయకులు జైళ్లలో వుండగానే పార్టీ నాయకులలో కొందరు అతివాద దుస్సాహసిక భావాల ప్రభావానికి గురైనారు. చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రేరణతో కార్యకలాపాలు ప్రారంభించారు. ఈ అతివాద దుస్సాహసిక పంథా ముప్పును పిఎస్ ఆదిలోనే పసిగట్టాడు. తెలంగాణా సాయుధ పోరాటమే తమకు ఉత్తేజమిచ్చిందని చెప్పేవారి మాటలను ఆయన తోసిపుచ్చాడు. ప్రజల్లో పనిచేయకుండా ప్రజా పునాది కూడగట్టకుండా సాయుధ పోరాటం గురించి మాట్లాడ్డం దుస్సాహసం తప్ప మరొకటి కాదని స్పష్టంగా చెప్పాడు. రాజ్యాన్ని కూలదోసేందుకై ప్రజలు ఆయుధాలు చేపట్టే దశకు దేశం చాలా దూరంలో వుందని ఆయన వివరించాడు. అతివాద దుస్సాహసిక పంథా మొదలైన నక్సల్బరీ ప్రాంతానికి ఆయన ప్రమోద్ దాస్‌గుప్తాతో కలసి వెళ్ళొచ్చారు. అక్కడున్న తిరుగుబాటు నాయకులకు ఐక్య సంఘటన ప్రభుత్వ సహకారంతో భూమి ఆక్రమించుకుని



ఎడమ నుండి : పి. సుందరయ్య, జ్యోతిబసు మరియు  ప్రమోద్ దాస్‌గుప్తా

రైతాంగానికి పంపిణీ చేయడం పట్ల ఎలాటి ఆసక్తి వున్నట్టు కనిపించలేదు. రాజ్యానికి వ్యతిరేకంగా సాయుధ పోరాటం చేయడం గురించే వారికి ఎక్కువ కుతూహలం వుందనిపించింది.

అతివాద దుస్సాహసిక పంథాకు వ్యతిరేకంగా పిఎస్ సూటిగా పోరాటం ప్రారంభించాడు. ఆంధ్రప్రదేశ్‌లో నాయకులు కార్యకర్తలలో గణనీయమైన భాగం ఈ భావజాలానికి లోనై వున్నారు. వారిపట్ల ఆయన చాలా కఠినమైన వైఖరి తీసుకున్నాడు. ఆ దుస్సాహసిక వైఖరికి ఎంతమాత్రం అవకాశం ఇవ్వడానికి నిరాకరించాడు. సైద్ధాంతిక సమస్యలను చర్చించి తుదిరూపమిచ్చిన 1968 బర్ద్వాన్ ప్లీనం తర్వాత ఆంధ్ర ప్రదేశ్‌లో పార్టీ పంథాను ధిక్కరించిన వారందరినీ పిఎస్ పార్టీ నుంచి బహిష్కరించాడు.

1964 నుంచి 1975 వరకూ పార్టీ ప్రధాన కార్యదర్శి బాధ్యతలు నిర్వహించిన పిఎస్ సిపిఎం వ్యూహాన్ని ఎత్తుగడలను రూపొందించిన సమిష్టి నాయకత్వ బృందంలో ఒక భాగంగా వున్నారు. దేశంలో సిపిఎంను అత్యంత బలమైన వామపక్ష శక్తిగా చేసిన విధానాలు అవే. పశ్చిమ బెంగాల్, కేరళ, త్రిపుర రాష్ట్రాలలో సిపిఎం వేగంగా

పెరిగింది. 1967లో కేరళ బెంగాల్‌లలో పార్టీ ప్రధాన పాత్రతో ఐక్య సంఘటన ప్రభుత్వాలేర్పడ్డాయి. రాష్ట్ర ప్రభుత్వాలలో పని దానికి సంబంధించిన మొత్తం కార్యక్రమ అవగాహన ఈ కాలంలో పార్టీ సరైన రీతిలో రూపొందించుకోగలిగింది.

సిపిఎం ఏర్పడిన తర్వాత కేంద్ర కమిటీ కలకత్తాలో నెలకొన్నది. 1971-77 కాలంలో పశ్చిమ బెంగాల్‌లో అర్థ ఫాసిస్టు బీభత్స కాండ సాగినప్పుడు పిఎస్ అక్కడే వుండి ఆ పోరాటంలో పాలు పంచుకున్నాడు. ఈ సంక్లిష్ట పరిస్థితిని అధిగమించడంలో పార్టీకి నిరంతరం సహకరిస్తూ దిశా నిర్దేశం చేస్తూ వచ్చాడు.

1975లో ఎమర్జన్సీ ప్రకటించబడినప్పుడు పిఎస్ అజ్ఞాత వాసంలోకి వెళ్ళాడు. దాన్ని ఎత్తివేసేవరకూ రహస్యంగానే వున్నాడు. రహస్యంగానే పనిచేశాడు. ఈ కాలంలోనే ఎలాటి ఎత్తుగడల పంథా అనుసరించాలనేదానిపై ఎడతెగని చర్చలు జరిగిన అనంతరం పిఎస్ ప్రధాన కార్యదర్శి పదవికి రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నాడు. 1976లో ఆ రాజీనామా విజ్ఞప్తిని ఆమోదించిన తర్వాత ఆయన ఆంధ్ర ప్రదేశ్‌పై కేంద్రీకరించాలని భావించాడు. అయినప్పటికీ ఆఖరు వరకూ ఆయన సిపిఎం కేంద్ర కమిటీ పొలిట్ బ్యూరోలలో వున్నారు.

## రచనలు, ప్రచురణలు

సుందరయ్య పుస్తకాలు విపరీతంగా చదివేవాడని ఇప్పటికే చెప్పుకున్నాం. మొదటి నుంచి సూక్ష్మ వివరాల్లోకి వెళ్ళడం ఆయనకు అలవాటు. మీరు ఏదైన పర్వతం ఎత్తు లేదా సముద్రం లోతు తెలుసుకోవాలంటే విజ్ఞాన సర్వస్వం చూడక్కర్లేదు, సుందరయ్యను అడిగితే చాలు వెంటనే చెప్పేస్తాడు అని బసవపున్నయ్య ఒక సందర్భంలో వ్యాఖ్యానించాడు. ఈ లక్షణం సుందరయ్యలో జీవిత పర్యంతం చెక్కు చెదరలేదు. ఎప్పటికప్పుడు తన విజ్ఞానాన్ని తాజాపర్చుకోవడం ద్వారా ఆయన యువతతోనూ కొత్త ఆలోచనలతోనూ సంబంధం పెట్టుకుంటూ వచ్చాడు. ఆయన జేబులోని చిన్న నోట్ పుస్తకం ఒక విజ్ఞాన సాగరం.

అయితే పిఎస్ అధ్యయనం పరిశోధన లేదా రచనలు కేవలం జ్ఞాన సముపార్జనకోసమే కాదు. ఏదైనా అవసరం వచ్చినపుడు లేదా దానిపై తన అవగాహన సమగ్రంగా ఉందని భావించినప్పుడు మాత్రమే ఆయన రాయడం మాట్లాడ్డం జరిగేది. ప్రచురితమైన ఆయన రచనలు చూస్తే ఆయన జీవితపర్యంత అధ్యయనం లోతు తెలుస్తుంది. వీరతెలంగాణా విప్లవ పోరాటం గుణపాఠాలు అన్న పుస్తకం ఆయన రచనలలో మకుటాయమానమైంది. ఒక రాజకీయ గ్రంథం సరిహద్దులు దాటేసిన గొప్ప రచన అది.క్షేత్రస్థాయిలో ఆయన అనుభవం, సైద్ధాంతిక చారిత్రిక అవగాహనల మేళవింపుగా రూపొందింది. పోరాటంలో నేలకొరిగిన వేలాది మంది కామ్రేడ్స్ గురించిన వివరాలు పత్రాల నుంచి నివేదికల నుంచి తన వ్యక్తిగత నోట్సు నుంచి తీసుకుని ఆయన పొందుపర్చాడు.మహిళల పాత్ర గురించి ప్రత్యేకంగా పేర్కొన్నాడు.ఈ పుస్తకాన్ని చైనా కామ్రేడ్స్ కూడా తమ భాషలోకి అనువదించుకున్నారంటే దాని గొప్పతనం తెలుస్తుంది.అనేక ముద్రణలు పొందిన ఈ పుస్తకం అనేక భాషల్లోకి అనువాదమైంది.

వ్యవసాయ సమస్యపై అత్యంత ప్రగాఢమైన అవగాహన గల కామ్రేడ్‌గా పిఎస్ గుంటూరు జిల్లాలోని రెండు గ్రామాలలో ఎమర్జెన్సీ కాలంలో భూ సమస్య అధ్యయనం చేశాడు. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన నదీజలాల సమస్యపై ఆయన చాలా సవివరమైన పుస్తకం రాశాడు. నిజానికి అది నీటిపారుదల రంగ నిపుణులే చేయగల రచన. అదొక దార్శనిక రచన గనకే అన్ని పార్టీలూ దాన్ని ప్రస్తావిస్తుంటాయి. సోషలిస్టు దేశాల విజయాలను గణాంకాలతో విశ్లేషించే మరో పుస్తకం కూడా పిఎస్ రాశాడు. అలాగే 1940లలో అభ్యుదయ రచయితల ఉద్యమంలో భాగంగా సాహితీ విమర్శ చేశాడు. పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఆయన అసంఖ్యాకమైన వ్యాసాలు రాశాడు. ఆ వ్యాసాలు, ఉపన్యాసాలు వివిధ రూపాలలో సంకలనాలుగా వెలువడ్డాయి. ఎంతో వొత్తిడి పెట్టిన మీదట తన జీవితపు చివరి దశలో పిఎస్ ఆత్మకథను రికార్డు చేశారు. మొదట తెలుగులో వెలువడిన ఆ పుస్తకం బ్రహ్మాండమైన స్పందనతో అనేక ముద్రణలు పొందింది. 2008లో దాని ఇంగ్లీషు పాఠాన్ని నేషనల్ బుక్‌ట్రస్ట్ ప్రచురించింది.

## చెరిగిపోని ముద్ర

సిపిఎంకు ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన పన్నెండేళ్లలోనూ పిఎస్ పార్టీని ప్రజా ఉద్యమాలను పెంపొందించడానికే ప్రతి నిముషం వెచ్చించారు. ఈ లోగా

ఆంధ్ర ప్రదేశ్‌లో కమ్యూనిస్టు ఉద్యమం కొన్ని ఎదురుదెబ్బలు తిని సాపేక్షంగా స్తబ్దతలో పడింది. పార్టీ కేంద్రంలో బాధ్యతలు నిర్వహించిన పిఎస్ 1977లో ఆంధ్ర ప్రదేశ్‌కు తిరిగివచ్చాక రాష్ట్రంలో కమ్యూనిస్టు ఉద్యమ పూర్వ ఔన్నత్యాన్ని పునః ప్రజ్వలింపచేసే కృషిలో నిమగ్నమైనారు. దాని నిర్మాణ వ్యవస్థను పటిష్టపర్చేందుకు, విప్లవ ప్రమాణాలు కాపాడుతూనే పునాదిని విస్తరించేందుకు అంకితమైనాడు. కృష్ణాజిల్లా దివిసీమలో ఉప్పెన జలప్రళయం సృష్టించినపుడు ఆయన ప్రజలను ఆదుకునేందుకు శాయశక్తులా కృషి చేశాడు. 1978లో ఆయన చివరి సారి శాసనసభకు ఎన్నికైనాడు. అప్పటికి వయస్సు పైబడినప్పటికీ పిఎస్ తన సేవాగుణం, అధ్యయన శీలత, నైపుణ్యం అలాగే కాపాడుకోగలిగాడు. నూతన చొరవలతో కార్యక్రమాలు నిర్వహించాడు. సిపిఎం 11 వ మహాసభ సందర్భంగా 1982లో విజయవాడ కృష్ణానదీ తీరంలో జరిగిన బ్రహ్మాండమైన సమీకరణ ఇందుకు నిదర్శనం. 1982లో ఆంధ్ర ప్రదేశ్ కమిటీ కార్యదర్శిగా ఎన్నికైన పిఎస్ తన శక్తిసామర్థ్యాలన్నిటినీ రాష్ట్రంలో పార్టీ నిర్మాణం మెరుగుపర్చడంపైనే కేంద్రీకరించాడు.

తను సుదీర్ఘ రాజకీయ జీవితంలో పిఎస్ అనేక సోషలిస్టు దేశాలు సందర్శించాడు. 1983లో చైనా కమ్యూనిస్టుపార్టీ మహత్తర గౌరవంతో పంపిన ప్రత్యేక ఆహ్వానాన్ని పురస్కరించుకుని ఆయన లైలాతో సహా ఆ దేశం సందర్శించాడు.

## పార్టీకి అజరామర నేత

1981 నుండి ఆయన ఆరోగ్యం తీవ్రగతిన క్షీణించడం ప్రారంభించింది. 1983లో మద్రాసులోని ఒక నర్సింగ్‌హోమ్‌లో ఆయన జీవన్మరణాల మధ్య ఊగిసలాడారు. కాని ఆయన తన దృఢ సంకల్పంతోను, వైద్య సంరక్షణతోను వ్యాధిని అధిగమించగలిగారు. ఏమైనా ఆయన పార్టీ కార్యక్రమాలలో పాల్గొంటూనే వచ్చినా ఆయన ఆరోగ్యం మళ్లీ కుదుట పడలేదు. 1985 మే 1న మరోసారి ఆస్పత్రిలో చేర్చారు. చివరకు మే19 . ఆదివారం ఉదయం 6.10కి ఆయన శాశ్వతంగా కన్ను మూశారు. ఆయన సహధర్మచారిణి కామ్రేడ్ లీలా సుందరయ్య ఆయన తుది ఘడియలలో ప్రక్కనే ఉన్నారు.

ఆయన మరణవార్త విని కమ్యూనిస్టులే కాదు, విభిన్న రాజకీయ అభిప్రాయాలు కలిగిన వివిధ తరగతుల ప్రజానీకమంతా దిగ్భ్రాంతి చెందారు. ఆయన భౌతికకాయాన్ని

మద్రాసు నుండి విజయవాడ తీసుకువస్తున్నప్పుడు దారి పొడవునా అశేష ప్రజానీకం, నివాళులర్పించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి లక్షలాదిగా విజయవాడ తరలివచ్చి ఆయన అంత్యక్రియలలో పాల్గొన్నారు. జాతీయోద్యమానికి, కార్మిక, కమ్యూనిస్టు ఉద్యమానికి ఒక్క ఆంధ్రలోనే కాదు, దేశం మొత్తానికి ఆయన ఏ రకంగా ప్రాతినిధ్యం వహించారో ఈ అంతిమ యాత్ర విదితం చేసింది.

సుందరయ్యతో సుదీర్ఘ కాలం సహచరుడుగా వున్న బసవపున్నయ్య తన నివాళిలో ఇలా అన్నాడు:

ఆయన ఒక్క కమ్యూనిస్టులకు మాత్రమే ప్రియతమమైన నాయకుడు కాదు. దేశభక్తులైన, స్వాతంత్ర్య పిపాస కలిగిన భారత ప్రజలందరి ప్రేమాభిమానాలను ఆయన చూరగొన్నారు. ఆయన అచంచలమైన మార్క్సిస్టు– లెనినిస్టు. మార్క్సిస్టు– లెనినిస్టు ఆలోచనా విధానపు స్వచ్ఛత కోసం ఆయన గట్టిగా నిలబడ్డారు. భారత కమ్యూనిస్టు ఉద్యమంలో మితవాద, అతివాద పెనుభూతాలకు వ్యతిరేకంగా తిరుగులేని పోరాటం సల్పారు. ఆయన ఆదర్శప్రాయమైన త్యాగనిరతి, నిరాడంబరత, ఆయనకు గౌరవమన్ననలను సంపాదించిపెట్టాయి. భారత కమ్యూనిస్టు ఉద్యమ ప్రముఖ నాయకునిగానే కాకుండా, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో అత్యున్నత స్థాయి నాయకులలో ఒకరిగా చరిత్రలో సుందరయ్య నిలిచిపోతారని చెప్పడానికి సాహసించ వచ్చుననుకుంటాను.

వర్గబానిసత్వం నుండి ప్రజలను విముక్తి చేసే ఆశయానికి కట్టుబడి ఉన్నవారు కనుక కమ్యూనిస్టులు స్వభావరీత్యానే మానవతావాదులు. ఐతే మాలో చాలామంది కమ్యూనిస్టుల కంటే ఎక్కువ మానవతావాదిగా చాలా సందర్భాలలో నా మనస్సును చూరగొన్నారు సుందరయ్య. ఆదర్శప్రాయమైన రీతిలో స్వీయావసరాలను త్యాగం చేయగలిగేవారు ఆయన. కాని ఇతర కామ్రేడ్స్ విషయం వచ్చినప్పుడు సుందరయ్య అత్యంత కరుణా హృదయంతో ఉన్న పరిస్థితులలో చేయగలిగినదంతా చేసేవారు. పార్టీ కేడర్ పట్ల ఆయన ప్రేమ సాటి లేనిది. ఈ విశిష్ట లక్షణాన్ని చాలామంది మార్క్సిస్టు– లెనినిస్టు నాయకులు కామ్రేడ్ సుందరయ్య నుండి నేర్చుకోవలసి ఉంది.

కాకలు తీరిన మరో యోధుడు కామ్రేడ్ బి.టి.రణదివే ఏమన్నారంటే– కామ్రేడ్ సుందరయ్య ఇన్ని విజయాలు సాధించగలిగారంటే ఆయనలో కొన్ని ప్రత్యేక సుగుణాలుండటమే దానికి కారణం. ఆయన అంకిత భావం, ప్రజలలో ఒకరుగా కలిసిపోగల ఆయన స్వభావం. బహుశా జనబాహుళ్యంలో అంతగా కలిసిపోయినవారు భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) లో ఒక్క ఎ.కె.గోపాలన్ తప్ప మరెవ్వరూ లేరు. వీరిద్దరూ ప్రజల తరఫు మనుషులుగా, ప్రజల యొక్క మనుషులుగా, ప్రజల కోసం నిలిచే మనుషులుగా ఎప్పుడూ జనబాహుళ్యంలోనే వుండేవారు. ప్రజలతో అందులోనూ అత్యంత అట్టడుగు వర్గాలతో సజీవ సంబంధాలు కలిగివుండటం, ఎప్పుడూ పార్టీ సభ్యులకు, కార్యకర్తలందరికి అందుబాటులో వుండటం, నిరాడంబర జీవితం వీటన్నిటి కారణంగానే సుందరయ్య పార్టీకి నూతన విజయాలు చేకూర్చగలిగాడు. కామ్రేడ్ పిఎస్ ఒక సంపన్నమైన జీవితం గడిపాడు. ధనసంపదలు సుఖ భోగాలలో గాక సిద్ధాంత బలం, ప్రజల ప్రేమాభిమానాలు పొందడంలో, పార్టీ కోసం చేయవలసిందంతా చేశామనే సంతృప్తి పొందడంలో ఆయన సంపన్నుడు. ఈ విధమైన సంపన్నత చాలా కొద్ది మందికే వుంటుంది. ఆయన స్మృతి మనలో చిరకాలం నిలిచివుండి మనందరం పార్టీకోసం పనిచేసే విధంగా ప్రేరణనిచ్చు గాక. పుచ్చలపల్లి సుందరయ్య 55 ఏళ్లపాటు కమ్యూనిస్టుగా జీవించారు. కృషి చేశాడు. కమ్యూనిస్టు పార్టీ నిర్మాతగా ఆయన ఎప్పటికీ గుర్తుండి పోతాడు.వ్యవసాయికోద్యమం పెంపొందించడంలో ఆయన ముఖ్యమైన దోహదం అందించాడు. తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటానికి ఆయన అందించిన నాయకత్వం భారత దేశ కమ్యూనిస్టు వుద్యమ చరిత్రలో మహత్తర అధ్యాయంగా నిలిచివుంటుంది. నిరంతరం ప్రజలకు దగ్గరగా వుండటం, నిరాడంబర జీవితం, సామాన్య ప్రజలతో మమేకత వగైరాల కారణంగా పిఎస్ ఎల్లప్పుడూ కమ్యూనిస్టులకు ఆదర్శంగా వుంటాడు.ఆయన గొప్ప ధైర్య సాహసాలు మార్క్సిస్టు నిబద్ధత గల వ్యక్తి. దోపిడీ అన్యాయం లేని సమాజాన్ని నిర్మించాలని కోరుకునే వారికి ఆయన జీవితం తరతరాలు ఆదర్శంగా వెలుగొందుతుంది.

ఆయన శతజయంతి సందర్భంలో మనమంతా ఆ విప్లవ వారసత్వాన్ని ముందుకు తీసుకుపోతామని ప్రతిన బూనుదాం.




.   .   .

నిరంతరం ప్రజల మేలు
కోరుకున్న సుందరయ్యా
నీలాగా నిప్పులాటి
నేతలు మాకెందరయ్యా?

సోషలిజం ఈ దేశపు
బిడ్డల తల నిమిరినపుడు
ఎర్రబడిన ఏ మబ్బుల
రథం మీదొ వచ్చి చూడు

- దేవీ ప్రియ

(ఉదయం- మే 20, 1985)